శభాష్ రాముడు ..!

గొర్రెల పెంపకంలో మేటి
శాస్త్రీయ పద్ధతి అనుసరణ
నాటు వైద్యానికి చెక్...
లాభాలు గడిస్తున్న యువరైతు

7లో





ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆత్మకూరు మండలం బి.యాలేరు సాగునీటి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు



కణేకల్లులో కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణికి కృతజ్ఞతలు తెలుపుతున్న బుక్కరాయసముద్రం కమిటీ

ఎదురు లేని ఎన్నిక..!

147
సాగునీటి సంఘాలు
కూటమి వశం
ఆగిన రెండు సంఘాల ఎన్నికలు
17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ విశ్వనాథ్‌రెడ్డి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. హెచ్చెల్సీ పరిధిలో 54 సంఘాలకు ఏకగ్రీవమయ్యాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 సాగునీటి సంఘాలకు గాను 93 సంఘాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన రెండు సంఘాలకు ఓటర్లు రాకపోవడంతో ఎన్నికలు జరగలేదు. ఈ నెల 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టులకు ఎన్నికలు నిర్వహిస్తారు.



టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్న నార్పల సాగునీటి కమిటీ

అధికార పక్షానికే..

- హెచ్చెల్సీ పరిధిలో 54 సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికల్లో అంతటా కూటమి పార్టీల మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ ఒక్కో సాగు నీటి సంఘానికి 12 మంది (ప్రాదేశిక నియోజక వర్గాల సభ్యులు) టీసీలు ఉంటారు. వీరిలో అధ్యక్షుడు, ఉపాధ్యాక్షుడు పోనూ.. మిగిలినవారు సభ్యులుగా కొనసాగుతారు.

- మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో 93 సంఘాలు ఏకగ్రీవం అయ్యాయి. బెళుగుప్ప మండలం శీర్పిలోని బీజకుందరి చెరువు, కూడేరు మండలం పొట్టి చెరువు (రామచంద్రాపురం) చెరువుకు ఓటర్లు ఎవరూ రాకపోవడంతో ఎన్నికలు జరగలేదు. జిల్లా వ్యాప్తంగా 606 టీసీలకు గాను 590 టీసీలు ఏకగ్రీవమయ్యాయి. తాడిపత్రి మండలం వంగనూరులో 2వ టీసీ, రాప్తాడు మండలం బుక్కచెర్ల టీసీ, కళ్యాణదుర్గం మండలం చాపిరిలోని మల్లేశ్వరస్వామి చెరువులో ఒక టీసీ, శీర్పిలో 6 టీసీలు, పొట్టిచెరువు 6 టీసీలకు ఎన్నికలు జరగలేదు. మైనర్ ఇరిగేషన్ పరిధిలోని ప్రతి సాగునీటి సంఘంలో 6 టీసీలు (ప్రాదేశిక నియోజక వర్గాల సభ్యులు) ఉంటారు. ఆరుగురు టీసీలు కలిసి ఒక ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారు. మిగిలిన నలుగురు టీసీలు సభ్యులుగా ఉంటారు.

అందరికీ కృతజ్ఞతలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



అనంతపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. టీడీపీ మద్దతుదారుల విజయానికి తోడ్పాటునందించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు, జిల్లా రైతాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరితో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికైన వారంతా రైతులకు ఉపయోగపడేలా పనిచేయాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన వైసీపీనాయకులు సాగునీటి సంఘాల ఎన్నికల్లో సత్తా చాటుతామని ప్రగల్భాలు పలికి, మరోసారి ఓటమి చవిచూశారని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ఉండవనే సాకుతో ముందుగానే జారుకున్నారని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ఎల్లప్పుడూ కష్టపడుతున్నారని అన్నారు.

పేక.. ముక్క..!

చిలమకూరు తిరుణాలలో జూదం

పోలీసుల అనుమతితోనే నిర్వహణ..? (6లో..)





అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

హక్కులను కాలరాస్తున్న పాలకులు

ప్రజా చైతన్యంతోనే తిప్పికొట్టడం సాధ్యం

మానవహక్కుల వేదిక మహాసభల్లో వక్తలు

(వివరాలు 6, మెయిన్ లో..)

వద్దులే నాగరాజూ..!

ఏఎస్‌ఓ నియామక ఉత్తర్వుల రద్దు

డీఈఓకు కలెక్టర్ తలంటు..?



డీఈఓ ఎదుట.. దర్జాగా నాగరాజు (ఫైల్)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం విద్య, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏఎస్‌ఓ నియాకమ ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖ అధికారులు రద్దు చేశారు. ఉత్తర్వులు ఇచ్చిన 24 గంటల వ్యవధిలోనే అడ్డగోలు నిర్ణయాన్ని మార్చుకున్నారు. డీఈఓ కార్యాలయంలో ఏపీఓగా పనిచేస్తున్న నాగరాజుకు అర్హత లేకున్నా, అనేక ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నా.. ఏఎస్‌ఓ పోస్టును కట్టబెట్టారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో 'నాగరాజుకే జై' శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో నియామకాన్ని రద్దు చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు శనివారం ఆగమేఘాల మీద ఉత్తర్వులు జారీ చేశారు. నాగరాజు నియామకంపై ఓ ఎమ్మెల్యే సైతం డీఈఓను ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలా నియమిస్తారని అసహనం వ్యక్తం చేశారు. పలు సంఘాల నేతలు డీఈఓను నిలదీశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి, కమిషనర్, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. కలెక్టర్ సైతం డీఈఓను పిలిపించి ఆరా తీశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎలా నియమిస్తారని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ డీఈఓపై మండిపడినట్లు తెలిసింది. వెంటనే నియామక ఉత్తర్వులను రద్దు చేసి, అర్హులను ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఒక రోజు వ్యవధిలోనే...

వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన నాగరాజును వెంటనే రిలీవ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆయన అక్రమాలపై విచారణ చేయాలని అనంతపురం ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా జిల్లా విద్యాశాఖ అధికారులు ఖాతరు చేయలేదు. ఏపీఓ నాగరాజు పట్ల అపార ప్రేమను కనబరిచారు. అన్ని వైపుల నుంచి వ్యతిరేకత రావడంతో డీఈఓకు తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోక తప్పలేదు. ఏఎస్‌ఓ నియామక ఉత్తర్వులను శనివారం సాయంత్రం రద్దు చేశారు. ఆయనను సోమవారం రిలీవ్ చేస్తామని డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు.

ఆర్థిక భద్రతే లక్ష్యం

జాబ్ మేళాలో ఎమ్మెల్యే అమిలినేని



ఇంటర్వ్యూలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగాలు కల్పించి, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన మెగా జాబ్ మేళా శనివారం ముగిసింది. ఏడు వేల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. మూడు వేల మందికి పైగా ఉద్యోగాలు సాధించారు. నిరుద్యోగులకు టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఏఎస్‌టీ సభ్యులు సహకరించారు. సుమారు 200 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎమ్మెల్యే పర్యవేక్షించారు. తన నియోజకవర్గంలో ప్రతి నిరుద్యోగి ముఖంలో చిరునవ్వు నింపుతానని అన్నారు. మరోసారి కూడా భారీ స్థాయిలో జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నానని అన్నారు.

కసి.. పట్టుదలే నడిపిస్తాయి

జాబ్ మేళాలో ఆర్థిక మంత్రి కేశవ్



మాట్లాడుతున్న మంత్రి కేశవ్

ఉరవకొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏదైనా సాధించాలనే కసి, పట్టుదలే ముందుకు నడిపిస్తాయని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పయ్యావుల సోదరుల ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. మంత్రి కేశవ్, ఆయన తనయులు విక్రమ్ సింహా, విజయ్ సింహా హాజరయ్యారు. జాబ్‌మేళాకు 4 వేల మంది హాజరుకాగా, 1260 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి మంత్రి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఇరవై ఏళ్లుగా తనకు అండగా నిలిచిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. జాబ్ మేళాకు 60కి పైగా కంపెనీలను రప్పించామని, 5వేల మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ ఖర్చులతో శిక్షణ ఇప్పించి, ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దారు మహబూబ్ బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, సీఐలు చిన్నగౌస్, మహనంది, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం రేగాటి నాగరాజు, మారెన్న, మాజీ ఎంపీపీలు సుంకరత్నమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఏమైంది నాగరాజూ..?

సిబ్బంది మాట వినడంలేదా..?

పాలకవర్గం.. అధికార పక్షం ఒత్తిళ్లా..?

నగరపాలిక కమిషనర్ అస్త్ర సన్యాసం

వచ్చిన మూడు నెలలకే దీర్ఘకాలిక సెలవు

అనంతపురం క్రైం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరపాలిక కమిషనర్ నాగరాజు ఉన్నఫలంగా సెలవులోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 16 నుంచి రెండు నెలల పాటు ఆయన దీర్ఘకాలిక సెలవులో వెళ్లనున్నారు. బాధ్యతలు చేపట్టి మూడు నెలలు కాకనే ఆయన లాంగ్ లీవ్ నిర్ణయం తీసుకోవడం కలకలం రేపుతోంది. సెప్టెంబరు 18న ఆయన నగరపాలికలో కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. మూడు రోజుల్లో కౌన్సిల్ మీటింగ్ ఉంది. ఆ తరువాత కమిషనర్ సెలవులో వెళతారని ప్రచారం జరిగింది. కానీ అంతవరకూ ఆగేలా కనిపించడం లేదు.

రాజకీయ ఒత్తిళ్లే...?

కమిషనర్ దీర్ఘకాలిక సెలవు నిర్ణయం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీ, పాలకవర్గ నడుమ ఆయన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకవర్గంలో వైసీపీవారు.. అధికారంలో కూటమి ఉండటంతో ఆయన పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైందని అంటున్నారు. క్వాలిటీ కంట్రోల్‌కు సంబంధించి థర్డ్‌పార్టీ టెండర్ విషయంలో అధికారపార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు వచ్చినట్లు తెలిసింది. సీ బిల్లులు, కాంట్రాక్టు పనుల విషయంలోనూ ఒత్తిళ్లు పనిచేసినట్లు తెలిసింది. తమకు తెలియకుండా ఏ పనీ చేయకూడదని కమిషనర్‌ను కొన్ని విషయాల్లో స్పష్టంగా ఆదేశాలిచ్చినట్లు సమాచారం. తమ వారికే వర్కులు దక్కేలా చేయాలని ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. పాలకవర్గం నుంచి మరో రకమైన ఒత్తిళ్ళు వచ్చాయని అంటున్నారు. కమిషనర్ చెక్కు ఇవ్వడాన్ని వివాదం చేయడం, కొన్ని సంతకాల కోసం ఒత్తిడి చేయడంతో సమస్యలు తలెత్తినట్లు తెలిసింది.

సిబ్బంది పలికితే ఒట్టు

నగరపాలిక సిబ్బంది కమిషనర్‌ను ఖాతరు చేయడం లేదు. ఎవరైనా వచ్చి కమిషనర్ పిలుస్తున్నారని చెబితే, వస్తాంలే అంటూ నిర్లక్ష్యంగా స్పందిస్తున్నారని సమాచారం. కమిషనర్ ఫైల్ తీసుకురమ్మన్నారని చెప్పినా తేలిగ్గా తీసుకుంటున్నారని, ఇలాంటి ఇబ్బందుల నడుమ కమిషనర్ సతమతమౌతున్నారని అంటున్నారు. డంపింగ్ యార్డ్‌లో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జేసీకి గతంలో ఫిర్యాదు చేశారు. ఆ ఫైళ్ల గురించి తాజాగా జేసీ ఆరా తీసినట్లు తెలిసింది. వాటిలో రెండు ఫైళ్లు కనిపించలేదం లేదని సమాచారం. దీంతో కమిషనర్ భయపడిపోయే పరిస్థితి నెలకొందని అంటున్నారు. కొన్ని విషయాలలో కమిషనర్ వ్యవహరించిన తీరు కూడా విమర్శలకు తావిచ్చింది.

టౌన్ ప్లానింగ్ అంటే వణుకు

'నగరపాలిక పరిధిలో ఏ విభాగమైనా సమస్య లేదు. కానీ టౌన్‌ప్లానింగ్ అంటే వణుకు వస్తోంది' అని కమిషనర్ కొందరి వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ విభాగంలోని ఓ అధికారి బిల్డింగ్‌ల వద్దకెళ్లి.. 'నా వాటా నాకిచ్చేస్తే ఏ సమస్యా ఉండదు. నేను మ్యానేజ్ చేస్తా. కమిషనర్ రారు.. ఎవరూ రారు. నేనే ఫైనల్' అని అంటున్నారట. దాదాపు అన్ని విభాగాల్లో కొందరు అధికారులు ఇలాగే ప్రవర్తిస్తున్నారని సమాచారం. తరచూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిరసనలు, ఆందోళనలు కమిషనర్‌ను ఒత్తిడిలోకి నెట్టినట్లు తెలిసింది.



నాగరాజు

> **అనారోగ్యంతోనే..**
>
> నాపై ఒత్తిళ్లు ఏమీ లేవు. అనారోగ్య కారణాలతోనే ఈ నెల 16వ తేదీ నుంచి సెలవులో వెళుతున్నాను. బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు తదితర సమస్యలు ఉన్నాయి. అందుకే సెలవు తీసుకుంటున్నాను.
>
> - నాగరాజు, కమిషనర్



సీసీ రోడ్డు నిర్మాణానికి ముందు రోడ్డు దుస్థితి



మన్నీల గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం

30 ఏళ్లకు మోక్షం

మన్నీలలో సీసీ రోడ్డు నిర్మాణం

అనంతపురం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నీల గ్రామంలోని ఓ రోడ్డుకు దాదాపు 30ఏళ్ల తరువాత మోక్షం కలిగింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత స్థానిక టీడీపీ నాయకులు చొరవ తీసుకుని రోడ్డు సమస్యను పరిష్కరించడంతో పాటు సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. గ్రామం నుంచి బత్తపల్లి మండలం పరిధిలోని ముష్టూరుకు వెళ్లేందుకు రోడ్డు ఈ రోడ్డు అనువుగా ఉంటుంది. అయితే రోడ్డు నిర్మాణానికి కొన్నేళ్లుగా స్థానికంగా అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

ఈక్రమంలో రోడ్డు నిర్మాణం పూర్తిగా నిలిచి పోయింది. గ్రామస్థులు రోడ్డు నిర్మాణ సమస్య పరిష్కారం కోసం మండల అధికారులకు ఎన్నోసార్లు వినతులు ఇచ్చారు. అయితే సమస్య పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. గత రెండు రోజులుగా రోడ్డు నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఎన్నాళ్లనాటి రోడ్డు సమస్యకు పరిష్కారం దక్కిందంటూ గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నెట్టికంటి సేవలో విద్యారణ్యభారతి స్వామీజీ

గుంతకల్లుటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతి స్వామీజీ శనివారం సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించి పూజలు జరిపించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కసాపురం ఆలయంలో విద్యారణ్య భారతి స్వామీజీ

హక్కులను కాలరాస్తున్న పాలకులు

ప్రజా చైతన్యంతోనే తిప్పికొట్టడం సాధ్యం
మానవహక్కుల వేదిక మహాసభల్లో వక్తలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక హక్కులను పాలకులు కాలరాస్తున్నారని, ప్రజా చైతన్యం ద్వారానే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం సాధ్యమని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) నాయకులు అన్నారు. అనంతపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వేదిక 10వ రాష్ట్ర మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఏపీ మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ మాట్లాడారు. కరువులకు నిలయమైన అనంతపురం జిల్లా పౌర ఉద్యమాలకు పెట్టింది పేరని ఆయన అన్నారు. మానవ హక్కుల వేదిక ఉద్యమంతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. 2009లో అనంతపురంలో జరిగిన మానవహక్కుల వేదిక మూడో రాష్ట్ర మహాసభల్లో బాలగోపాల్‌తో కలిసి తాను పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. దేశంలో అమలవుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజా చైతన్యంతోనే తిప్పిగొట్టగలమని



మాట్లాడుతున్న మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు గేయానంద్

అన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను పాలకులు నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారని ఓపీడీఆర్ నాయకుడు రామ్‌కుమార్ విమర్శించారు. ఆదివాసి సమస్యలపై పోరాడే స్టాలిన్‌ను నిర్బంధించి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాల తరపున గొంతెత్తేందుకు పౌరహక్కుల సంఘాలు మరింతగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో ప్రజాసంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని హెచ్ఆర్ఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు భుజంగరావు విమర్శించారు. అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే క్రమంలో ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చేస్తున్నారని అన్నారు. వారి హక్కులను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను ఫేక్ ఎన్‌కౌంటర్ల పేరుతో, ఇతర రూపాల్లోనూ అణచివేస్తున్నారని డెమోక్రటిక్ పీపుల్స్ ఫోరం నాయకుడు శ్రీధర్ అన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్ రసూల్, ఎస్ఎం బాషా, అనంతపురం జిల్లా నాయకులు సుబ్బన్న, ఆహ్వాన సంఘం నాయకులు దాదా గాంధీ తదితరులు పాల్గొన్నారు.


మహా సభలకు హాజరైన హెచ్ఆర్ఎఫ్ ప్రతినిధులు

కమిటీలు.. తీర్మానాలు

హెచ్ఆర్ఎఫ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కమిటీలను తొలిరోజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీకాకుళానికి చెందిన జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శిగా అమలాపురానికి చెందిన రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ అధ్యక్షుడిగా ఉట్నూరుకు చెందిన ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా జమ్మికుంటకు చెందిన డాక్టర్ ఎస్ తిరుపతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రాష్ట్రాల నుంచి 144 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రానున్న రెండు సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కమిటీల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. నూతన కమిటీల సమక్షంలో 24 అంశాలపై తీర్మానాలు చేశారు. అనంతరం ఫంక్షన్ హాల్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు 'ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి - వాక్ స్వాతంత్ర్య హక్కు వర్ధిల్లాలి' అని నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. మహాసభలలో రెండోరోజు ఆదివారం 'కులగణన ఎందుకు అవసరం' అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు, 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై స్వతంత్ర విలేకరి మాలిని సుబ్రహ్మణ్యం, 'కాషాయీకరణ, కార్పొరేటీకరణ' అనే అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారు.

కలుగులో ఎలుకలు బయటికొచ్చాయ్..!


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత

వైసీపీ నాయకులకు పరిటాల సునీత చురక

అనంతపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల పాటు కలుగులో దాక్కున్న ఎలుకలన్నీ బయటకొచ్చి కిస్‌కిస్ అంటున్నాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వైసీపీ నేతలను ఎద్దేవా చేశారు. వైసీపీ రైతు పోరుబాటపై శనివారం ఆమె స్పందించారు. రైతుల గురించి మాట్లాడే నైతికత ఆ పార్టీ నాయకులకు లేదని అన్నారు. కరువు జిల్లా రైతాంగానికి ఆ పార్టీ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదని మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా రైతులకు రూ.2378 కోట్ల పరిహారం ఇస్తున్నామని ప్రకటించి.. ఎగ్గొట్టలేదా అని జగన్‌ను ప్రశ్నించారు. రైతులకు ఇంత అన్యాయం జరుగుతుంటే అప్పటి ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రశ్నించారా అని నిలదీశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూక్ష్మ సేద్య పథకంతో పండ్ల తోటలు విస్తారంగా సాగయ్యాయని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంత మంది రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు ఇచ్చారో చెప్పే ధైర్యం వైసీపీ నాయకులకు ఉందా అని సవాలు విసిరారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అన్ని వర్గాలకు మంచి చేయాలనే యోచనలో ముందుకు వెళుతోందని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేనందున కూటమి ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆరు నెలలుగా కనిపించని వైసీపీ నాయకులంతా ఇప్పుడు బయటికొచ్చి రైతులపై కమటప్రేమ ప్రదర్శిస్తున్నారని, జిల్లా రైతాంగం వారిని నమ్మే పరిస్థితి లేదని అన్నారు.

రైల్వే డివిజన్‌కు జాతీయ పురస్కారాలు

ఇంధన పరిరక్షణకు వరించిన అవార్డులు


అవార్డును అందుకుంటున్న డీఆర్ఎం విజయ కుమార్

గుంతకల్లు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌కు రెండు జాతీయ ఇంధన పరిరక్షణ పురస్కారాలు లభించాయి. భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గుంతకల్లు రైల్వే ఆసుపత్రికి, రేణిగుంట రైల్వే స్టేషన్‌కు ఇంధన పరిరక్షణలో ప్రథమ బహుమతి లభించింది. ఢిల్లీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ నుంచి డివిజన్ అవార్డులను డీఆర్ఎం విజయకుమార్ స్వీకరించారు. గుంతకల్లు రైల్వే ఆసుపత్రిలో గ్రిడ్, జనరేటర్ల ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్తు కారణంగా 2021-22లో 2.27 లక్షల యూనిట్ల కొనుగోలు విద్యుత్ వినియోగాన్ని 2022-23 సంవత్సరంలో 1.85 లక్షల యూనిట్లకు, 2024-25 నాటికి 0.96 లక్షల యూనిట్లకు తగ్గించారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఇలాగే 7.17 లక్షల యూనిట్ల వినియోగం నుంచి 2.73 లక్షల యూనిట్లకు కొనుగోలు విద్యుత్ వినియోగాన్ని తగ్గించారు. ఈ కారణంగా డివిజన్‌కు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు లభించాయి.

కలిసి ఉండండి

దంపతులను కలిపిన న్యాయాధికారి


దంపతులు ఒక్కటైనట్లు పత్రం అందిస్తున్న న్యాయమూర్తి కంపల్లె శైలజ

హిందూపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అన్యోన్యంగా ఉన్న దంపతులు మనస్పర్థలతో రెండేళ్ల నుంచి విడిగా ఉంటూ విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కారు. కానీ న్యాయాధికారి కౌన్సెలింగ్‌తో ఆ దంపతులు ఒక్కటయ్యారు. ఈ సంఘటన హిందూపురంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో చోటుచేసుకుంది. హిందూపురం మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, నారాయణలకు 2018లో పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే రెండేళ్ల నుంచి భార్య కాపురానికి రాకపోవడంతో నారాయణ విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కారు. ఈ పరిస్థితుల్లో లోక్‌అదాలత్‌కు వారిద్దరిని పిలిపించి అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ కౌన్సెలింగ్ ఇచ్చారు. న్యాయాధికారి చెప్పిన మాటలు విని ఇద్దరు కలిసి ఉండటానికి ఒప్పుకున్నారు. దీంతో ఆమె వెంట వచ్చిన కుమారులు ఇద్దరు ఎంతో సంతోషంగా తండ్రి వద్దకు వెళ్లారు. ఇది చూసిన న్యాయాధికారి కంపల్లె శైలజతోపాటు మరో న్యాయాధికారి, న్యాయవాదులు వారిని అభినందించి ఒక్కటైనట్లు పత్రం అందజేసి పంపించారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


తిప్పమ్మ (ఫైల్)

కదిరి, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని మలకవారిపల్లి గ్రామానికి చెందిన తిప్పమ్మ (68) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఎస్ఐ వెంకటనారాయణ తెలిపిన మేరకు మలకవారిపల్లికి చెందిన తిప్పమ్మ తన కుమార్తె సమాధి వద్ద ముళ్లచెట్లు పెరగడంతో వాటిని తొలగించడానికి వెళ్లారు. అయితే సమాధి పక్కనే పడి ఉన్న విద్యుత్ తీగను గమనించలేదు. విద్యుత్ సరఫరా అవుతున్న ఆ తీగను తాకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ వెంకటనారాయణ శవాన్ని పరిశీలించారు. మృతురాలి కుమారుడు భైరారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర మైనార్టీ అఫైర్ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మైనార్టీ అఫైర్ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లాకొచ్చిన ఆయన రోడ్లు, భవనాల అతిథి గృహంలో మైనార్టీ సంక్షేమ శాఖ, కార్పొరేషన్, వక్ఫ్‌బోర్డు, మైనార్టీ వసతిగృహాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. మైనార్టీల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆ పథకాలకు అర్హులైన వారికి లబ్ధి అందజేసేందుకు ప్రతి ఒక్క అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ ఉమ్మడి జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటిని తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

అనంతరం జడ్పీలోని డీఆర్సీ సమావేశపు హాల్‌లో జిల్లాలోని ముస్లిం మైనార్టీ సంఘాలు, ఖాజీలు, పెద్దలు, క్రిస్టియన్ మైనార్టీ సంఘాల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. వారికందాల్సిన సంక్షేమ పథకాలను పక్కదారి పట్టించి మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఆయా కార్యక్రమాల్లో మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ రహీం, క్రిస్టియన్ మైనార్టీ డీపీఎం మధుసూదన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్లు సాలార్ బాష, గౌస్‌మొద్దీన్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

గార్లదిన్నె: మైనార్టీ గురుకుల పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. గార్లదిన్నెలోని మైనార్టీ గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలల్లోని గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


షరీఫ్‌ను సన్మానిస్తున్న అల్‌మేవా నాయకులు

నిబద్ధతకు నిదర్శనం షరీఫ్

అనంతపురం క్లాక్‌టవర్: నిజాయతీ, అంకితభావం, నిబద్ధతకు నిదర్శనం ఎంఏ షరీఫ్ అని ఆల్‌మేవా నాయకులు కొనియాడారు. జిల్లాకు వచ్చిన ఎంఏ షరీఫ్‌ను శనివారం స్థానిక జిల్లా పరిషత్తు ఆవరణంలోని డీఆర్సీ భవనంలో ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆల్‌మేవా నాయకులు మాట్లాడుతూ షరీఫ్ సేవలను గుర్తించి ప్రభుత్వ మైనార్టీ సలహదారులుగా నియమించడం పట్ల సీఎం చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్‌మేవా నాయకులు పకృద్దీన్, షెక్షావలీ, ఫరూఖ్, మహ్మద్‌దౌలా, జిలాన్, అన్వర్, అష్రాఫ్, ఆలీబాబా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 6,235 కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 6235 కేసులకు పరిష్కారం చూపినట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెగా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 25 బెంచులు ద్వారా 5753 క్రిమినల్, 151 సివిల్, 66 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. ప్రమాద భరిత కేసులలో కక్షిదారులకు రూ.56750000, సివిల్ కేసులలో రూ.3196134, ప్రీలిటిగేషన్ కేసులలో రూ.12184731 చొప్పున పరిహారం ఇప్పించినట్లు వివరించారు. కక్షిదారులు, ఫిర్యాదిదారులు రాజీకి సమ్మతించడంతో పెద్దఎత్తున పరిష్కారాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.


రాజీపత్రాన్ని అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు, ఎస్పీ జగదీష్

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు

జిల్లా క్రీడాకారుల ఎంపిక


సంతోష్, ఉజ్వలేశ్వర్ సాయి, జీవన్

అనంతపురం క్లాక్ టవర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించే 49వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్- 2024 పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా క్రీడాకారులు సంతోష్, ఉజ్వలేశ్వర్ సాయి, జీవన్‌లు ఏపీ రాష్ట్రం తరపున జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో నిర్వహించిన ఏపీ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ చాటిన క్రీడాకారులు జాతీయ పోటీలకు అర్హత సాధించడం అభినందనీయమని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రనేల వీధిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న అంజలి అనే మహిళ ఇంటిని సోదా చేశారు. 384 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ హసీనాబాను తెలిపారు. ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

విస్తరిస్తున్న పొగాకు సాగు

- ఆసక్తి చూపుతున్న రైతులు
- రెండు మండలాల్లో 150 ఎకరాల్లో సాగు
- ప్రోత్సహిస్తున్న ప్రైవేట్ కంపెనీ



తాడిపత్రి నియోజకవర్గంలో గత రెండు మూడేళ్ల నుంచి పొగాకు సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. పుట్లూరు, యల్లనూరు మండలాల పరిధిలోని నల్లరేగడి భూముల్లో ఉద్యాన పంటలతోపాటు పొగాకు పంటను సాగు చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ ప్రాంతంలో సాగు చేయకపోయినా, కొందరు రైతులు వినూత్నంగా ఆలోచించి పొగాకు పంటను సాగు చేస్తున్నారు. పొగాకు పంటకు మార్కెట్‌లో డిమాండ్, ధర బాగా ఉండటంతో కొందరు రైతులు సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. తక్కువ నీటితోనే ఆశించినస్థాయిలో దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఓ ప్రైవేట్ కంపెనీ ముందుగానే ఒప్పందం చేసుకుని, పొగాకు పంటను కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. యల్లనూరు మండలంలోని వేములపల్లి, గిర్రమ్మబావి, పీఎం కొండాపురం, పుట్లూరు మండలంలోని శనగలగూడూరు, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 150ఎకరాల్లో పంట సాగుచేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, పుట్లూరు/యల్లనూరు

రాజమండ్రి ప్రాంతం నుంచి మొక్కలు తెచ్చి..

రాజమండ్రి ప్రాంతంలోని నర్సరీల నుంచి ఇక్కడికి పొగాకు మొక్కలను తెస్తున్నారు. ఆ మొక్కలను నాణ్యతను బట్టి 30పైసల నుంచి అర్ధ రూపాయి వరకు రైతులకు నర్సరీల నిర్వాహకులు విక్రయిస్తారు. సాగు చేసిన నాలుగునెలలు తర్వాత ఏపుగా పెరిగినా పంటను కోస్తారు. ముందుగా 70-80రోజుల మధ్యన ఈ ఆకు పండువారి రాలుతుంది. తర్వాత రైతులు ఆ పంటను కోసి 20రోజులపాటు ఎండబెడతారు. ఎండబెట్టిన అనంతరం కంపెనీ ఇచ్చిన బోరా సంచుల్లో వేసి బనగానపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీకి ట్రాన్స్‌పోర్టు చేస్తారు.

తక్కువ పెట్టుబడి

పొగాకు పంటను తక్కువ పెట్టుబడితో సాగు చేయవచ్చని రైతులు చెబుతున్నారు. ఈ పంటకు నీటి తడులు కూడా అంతంత మాత్రంగా ఉన్నా సరిపోతుంది. ఎకరా పొగాకు పంటకు సుమారు రూ.50 వేలు నుంచి రూ.80వేలు పెట్టుబడి అవుతుంది. కొందరు రైతులు పంట పరిస్థితిని బట్టి డ్రిప్పు సాయంతో నీరు పెడుతున్నా రు. ఎకరాకు సుమారు 12నుంచి 18క్వింటాళ్లవరకు దిగుబడి వస్తుంది. వీటికి ఎలాంటి తెగుళ్లు సోకవు. మందులు కూడా పిచికారీ చేయాల్సిన అవసరం లేదని రైతులు చెబుతున్నారు. బోర్లలో నీరు తక్కువ ఉన్న రైతులు పొగాకు పంటపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

క్వింటానికి రూ.15వేల ప్రకారం..

పండించిన పొగాకు పంటను నంద్యాల జిల్లా బనగానపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీ ముందుగానే కుదుర్చుకున్న ఒప్పందం మేరకు కొనుగోలు చేస్తుంది. రైతులు పంట సాగు సమయంలోనే క్వింటా రూ.15వేలు చొప్పున కంపెనీతో మాట్లాడుకొని వచ్చి, పంట పండిన తర్వాత మొత్తం దిగుబడిని బనగానపల్లికి సరఫరా చేస్తారు. రవాణా ఖర్చులకు సైతం క్వింటాకు రూ.100నుంచి రూ.500లోపు కంపెనీనే ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. విక్రయించిన పంట డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లోకే మరుసటి రోజే జమ చేస్తున్నారు. కంపెనీ ప్రతినిధులు పంట కాలంలో కూడా రైతుల వద్దకు తోటను పరిశీలిస్తుంటారు. రైతులకు పంటపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు, సలహాలు ఇస్తుంటారు. పొగాకు పంట సాగు చేయాలనుకునే రైతులు ఎవరైనా ఉంటే కంపెనీ ప్రతినిధులే నేరుగా వచ్చి వారిని కలుస్తుంటారు.

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



నేను మూడేళ్ల నుంచి 20 ఎకరాల్లో పొగాకు పంటను సాగుచేస్తున్నా. పంట లాభదాయకంగా ఉంది. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ప్రభు త్వం కొంత మేర ప్రోత్సాహం అందిస్తే బాగుంటుంది. ఈ పంట గురించి విషయాలు తెలియని రైతులకు వివరిస్తే ఇంకా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ఈ రెండు మండలాల్లో భూగర్భజలాలు అంతంతమాత్రంగానే ఉన్నా పొగాకు సాగుకు సమస్య ఉండదు. ఒక ఇంచు నీరు వచ్చే బోరు ఉన్నా సుమారు ఐదెకరాలకుపైగా పొగాకు పంటను సాగు చేయవచ్చు.

- ప్రకాష్‌నాయుడు, వేములపల్లి

పేక.. ముక్క..!

చిలమకూరు తిరుణాలలో జూదం
పోలీసుల అనుమతితోనే నిర్వహణ..?

యల్లనూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుణాలలో దుకాణాలను ఏర్పాటు చేయడం సహజం. పోలీసుల కళ్లుగప్పి.. కొందరు మద్యం సేవించడం, పేకాట ఆడటం కూడా పరిపాటి. కానీ, వేడుక జరిగే ప్రాంతానికి కాస్త దూరంగా, మరుగున ఇలాంటి పనులు చేస్తుంటారు. విషయం తెలిస్తే.. పోలీసులు చర్యలు తీసుకుంటారు. కానీ చిలమకూరు ఆంజనేయ స్వామి తిరుణాలలో వ్యవహారం శృతిమించింది. ఏకంగా స్వామివారి ఆలయం పక్కనే పేక.. ముక్క ఆడించారు. పోలీసులు అడిగితే.. 'సార్ అనుమతి తీసుకున్నాం కదా..?' అని ఎదురు ప్రశ్న వేశారు. దీంతో పోలీసు సిబ్బంది అవాక్కయ్యారు. యల్లనూరు మండలం చిలమకూరులో ఏటా ఆంజనేయస్వామి తిరుణాల నిర్వహిస్తారు. ఈ ఏడాది శుక్ర, శనివారాలలో వేడుక ఘనంగా జరిగింది. ఎప్పటిలాగానే గాజులు, బొమ్మలు, తినుబండారాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. కానీ ఎన్నడూ లేని విధంగా ఈసారి పేక.. ముక్క (అందర్.. బాహర్) ఆడించారు. శుక్రవారం రాత్రి అంతా ఆట కొనసాగింది. వేలాది రూపాయలు చేతులు మారాయి. ఇంతకూ వీరికి ఏ సారు అనుమతి ఇచ్చారో తెలియదు. 'సార్ అనుమతి ఇచ్చారు కదా..?' అని అనగానే బందోబస్తుకు వెళ్లిన సర్కిల్ పోలీసులు నివ్వెరపోయారు. చర్యలు తీసుకోవాలో.. వదిలేయాలో తెలియక బుర్ర గోక్కున్నారు.


ఆలయం వద్ద బహిరంగంగా జూదం

ఆటలో మైనర్‌లు

పేక.. ముక్క ఆటలో పెద్దలతోపాటు మైనర్లు కూడా పాల్గొన్నారు. యువకులతోపాటు పన్నెండేళ్ల బాలుడు పందెం కాస్తూ కనిపించాడు. తిరుణాలకు వచ్చిన భక్తులు ఈ జూదాన్ని చూసి నివ్వెరపోయారు. చదువుకోవాల్సిన పిల్లలను ఇలా తప్పుదారి పట్టిస్తే పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ తమ గ్రామంలో ఇలాంటివి చూడలేదని అన్నారు. జూదానికి పోలీసులు నిజంగానే అనుమతులు ఇచ్చారా అనే చర్చ జరుగుతోంది. ఇంత బహిరంగంగా జూదం ఆడుతున్నా పోలీసులు పట్టించుకోలేదంటే.. అనుమతి ఇచ్చే ఉంటారని అంటున్నారు.

శభాష్ రాముడు ..!

- గొర్రెల పెంపకంలో మేటి
- శాస్త్రీయ పద్ధతి అనుసరణ
- నాటు వైద్యానికి చెక్...
- లాభాలు గడిస్తున్న యువరైతు



గొర్రెల పెంపకం కోసం ఏర్పాటు చేసిన షెడ్



గొర్రెల పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశం

స్ఫూర్తి

శింగనమల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పాసై ఇంటికి వచ్చాడు. తాతల కాలం నుంచి వ్యవసాయంలో అవే నష్టాలు ఆవే బాధలు. పనికి వచ్చే కూలీలను గమనించాడు. ఇలాగే కొనసాగితే వ్యవసాయం బరువు అని గ్రహించాడు. తాను కూడా వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. పైతరగతులకు వెళ్లాలని పెద్దలు చెప్పినా వ్యవసాయమే చేస్తా అన్నాడు. అందరితో కలసి తోటలకు వెళ్లేవాడు. పంటలు చేతికి వచ్చినా కూలీలకు సరిపోయేది. ఇన్ని రోజుల కష్టానికి ఫలితం ఇంతేనా అనుకున్నాడు. వ్యవసాయానికి అనుబంధంగా ఏమైనా చేయాలని భావించాడు. అలా తన ఆలోచన గొర్రెల పెంపకం వైపు మళ్లింది. గొర్రెల పెంపకందారుల వద్దకు వెళ్లి చూశాడు. వాళ్లు పాత పద్ధతులే అనుసరిస్తున్నారు. వంద గొర్రెలు తీసుకొచ్చి అప్పటికే తమ వద్ద ఉన్న పనివారితో కలిసి పెంపకం మొదలు పెట్టాడు. పాత పద్ధతులతోనే పెంచడం ద్వారా ఆశించిన ఫలితాలు రాలేదు. సొంత స్థలంలోకి వచ్చి శాస్త్రీయ పద్ధతుల్లో గొర్రెలు పెంపకంతో ఏడాదికి రూ.లక్షలు గడిస్తున్నాడు పెరవలి గ్రామానికి చెందిన యువ రైతు పుచ్చకాయల రామునాయుడు.

షెడ్లలో గొర్రెల పెంపకం

అప్పటి వరకు గొర్రెల కాపరులు పగలు పొలాల్లోకి మేతకు వెళ్లి.. రాత్రిళ్లు ఒక పొలంలో నిలుపుకునేవారు. తద్వారా గొర్రెలకు కొన్ని వ్యాధులు వచ్చేవి. ఈ వ్యాధులు ఎందుకు వస్తున్నాయని డాక్టర్లను సంప్రదించాడు. గొర్రెలు నేల మీద పడుకోవడం వల్ల వాటి మలమూత్రాలతో కొన్ని వ్యాధులు సంక్రమిస్తున్నాయని చెప్పారు. దీంతో రూ. లక్ష పైగా ఖర్చు చేసి పెద్ద షెడ్ ఏర్పాటు చేశాడు. గొర్రెలు షెడ్డులో పడుకుంటే వాటి మూలమూత్రాలు కిందికి వచ్చేలా చెక్కలతో పరుపు ఏర్పాటు చేశాడు. తద్వారా గొర్రెలకు వ్యాధులు తగ్గడంతో పాటు వాటి ఎరువు కూడా ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. గొర్రెలకు వ్యాధులు వస్తే ఎక్కువ శాతం కాపరులు నాటు వైద్యం చేసేవారు. ఈయన గొర్రెకానీ.. పిల్లకానీ చనిపోతే వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించి కారణాలు తెలుసుకుంటాడు. వారి సలహా మేరకు మందులు వాడతాడు. తనకున్న అనుభవంతో చాలా వరకు సొంతంగా వైద్యం చేస్తాడు.

కోళ్ల పెంపకం

గొర్రెలకు అనుబంధంగా కోళ్ల పెంపకం కూడా చేపట్టాడు. సాధారణంగా షెడ్డు కింద ఉన్న గొర్రెల ఎరువులో పురుగులు, పిడుదులు ఉంటాయి. కోళ్లు ఉండటం వల్ల వాటిని తింటాయి. ఎరువు శుభ్రంగా ఉండటంతో ధర కూడా ఎక్కువగానే పలుకుతుంది. కోళ్ల ద్వారా అదనంగా గుడ్లతో పాటు ఆదాయం వస్తోంది.

ఐదేళ్లలో వెయ్యి గొర్రెలు

2015లో వంద గొర్రెలతో పెంపకం మొదలు పెట్టాడు. 2016లో మరో వంద తీసుకొచ్చాడు. వీటిని కాసేందుకు సంవత్సరం వేతనం ఒప్పందంతో ఇద్దరు కూలీలను ఏర్పాటు చేసుకున్నాడు. 2020 నాటికి వెయ్యి గొర్రెల పైగా అయ్యాయి. వాటి సంరక్షణకు మరో ఇద్దరు కూలీలను ఏర్పాటు చేశాడు. ప్రతి సంవత్సరం లక్షల్లో ఆదాయం గడించాడు. వంద గొర్రెలు పెంచడానికి ఇద్దరు కూలీలు కావాలి. వీరికి నెలకు రూ.10వేలు చొప్పున ఇద్దరికి సంవత్సరానికి రూ.2.40 లక్షలు అవుతుంది. దీంతోపాటు గడ్డి మందులు, ఇతర ఖర్చులు మరో రూ.1.50 లక్షలు అవుతుంది. వంద గొర్రెలు పెంచితే సంవత్సరానికి రూ.4 లక్షల నుంచి రూ. 5 లక్షలు వరకు ఆదాయం వస్తోంది. యువరైతుకు వెయ్యి గొర్రెల పంపకంతో సంవత్సరానికి రూ.50 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ప్రతి వంద గొర్రెలకు 5 విత్తన పొట్టేళ్లు ఉండాలి. వీటిలో దాదాపు 80 గొర్రెలు రెండేళ్లలో మూడు ఈతలు ఇస్తాయి. రెండు సంవత్సరాల్లో ఇంచు మించు 240 నుంచి 250 గొర్రె పిల్లలు అవుతాయి. వీటిలో పొట్టేలు పిల్లలు దాదాపు సగం అనుకున్నా 125 అవుతాయి. ఒక్కో పిల్ల రూ.6 వేల నుంచి రూ.7 వేలు ధర పలుకుతాయి. ఈ లెక్కన కనీసం రూ.7.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. బ్బురాయసముద్రం కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు సూచనలు చాలా ఉపయోగపడ్డాయని రైతు తెలిపాడు.

పాత పద్ధతులు మానుకోవాలి



రైతు అభివృద్ధి చెందాలి. రైతు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. రైతులు కూడా పాత పద్ధతులను మార్చుకోవాలి. కాలానికి అనుగుణంగా మారుతున్న వ్యవసాయ విధానాలతో పాటు అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి. గొర్రెల పెంపకానికి మా కుటుంబం కూడా తోడ్పాటు అందించింది. గొర్రెల పెంపకంతో లాభాలు రావడంతో వ్యవసాయంపై కూడా దృష్టి సారించాను.

- పుచ్చకాయల రామునాయుడు

ఆసక్తికరంగా రూరల్ క్రికెట్ లీగ్



రివ్య



గీతిక



గౌతమి



హిమవర్షిణి



హాస్నిరెడ్డి



కౌశిక్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో బాలుర అండర్-15, బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. బాలికల పోటీల్లో ఎస్ఎస్‌బీఎన్, తపోవనం క్రికెట్ అకాడమీ జట్లు తలపడగా 30 ఓవర్లలో ఎస్ఎస్‌బీఎన్ 2వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసింది. సుమియాతేజ్ 72, గౌతమి 82పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన టీసీఏ కేవలం 22 ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 209పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. గీతిక 80, హిమవర్షిణి 82పరుగులు చేశారు. మరో మ్యాచ్‌లో కదిరి, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడగా ఏఎస్ఏ నిర్ణీత 30ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 295పరుగులు చేసింది. బ్యాటర్లు హాస్నిరెడ్డి 19, రివ్య 105పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కదిరి 30ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 136పరుగులు మాత్రమే చేసింది. ఇందులో నిత్యారెడ్డి 92పరుగులు చేసి వికెట్లు పడకుండా కాపాడుకుంది. దీంతో ఏఎస్ఏ 159భారీ పరుగుల తేడాతో విజయం నమోదు చేసింది. బాలుర పోటీల్లో తపోవనం క్రికెట్ అకాడమీ, పీటీసీ జట్లు తలపడగా...టీసీఏ 40ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 234పరుగులు చేసింది. కౌశిక్ 130పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన పీటీసీ 40ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 179పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఏసీఏ 55పరుగుల తేడాతో గెలుపొందింది.

అందరికీ దేవుడు ఒక్కడే

మత పెద్దలు, వక్తలు



సర్వమత సమ్మేళనంలో ఐక్యత చాటుతున్న మతపెద్దలు, కవులు

పెనుకొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కులాలు, మతాలు వేరైనా, పూజించే దేవతల రూపాలు వేరైనా అందరికీ దేవుడు ఒక్కడేనని వివిధ మతాలకు చెందిన మతపెద్దలు, వక్తలు పేర్కొన్నారు. బాబయ్యస్వామి 752 గంధం మహోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సందల్‌మహాల్‌వద్ద శుక్రవారం రాత్రి దర్గా పీఠాధిపతి తాజ్ బాబా అధ్యక్షతన ఖవాలీ మహాల్‌వద్ద సర్వమత సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మైనార్టీ సలహాదారుడు షరీఫ్‌అహ్మద్, ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్, వివిధ మతాలకు చెందిన కవులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాజ్ బాబా మాట్లాడుతూ జాతి సమైక్యత ప్రపంచ శాంతి కోసం తుదిశ్వాస వరకు కృషి చేస్తానన్నారు. షరీఫ్‌అహ్మద్ మాట్లాడుతూ భారతదేశంలోనే ఏ దర్గాలోనూ ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించడం లేదని, పెనుకొండ దర్గాలో 35ఏళ్లుగా జాతీయ సమైక్యత కార్యక్రమం నిర్వహిస్తున్న తాజ్ బాబా అభినందనీయుడన్నారు. గజల్ శ్రీనివాసులు మాట్లాడుతూ కుల మతాలకు, జాతి, మత బేధాలకు అతీతంగా అందరూ ఐక్యతతో కలిసి పనిచేయాలన్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 30మందిని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయితల సంఘం అధ్యక్షులు చాంద్‌బాషా, జాన్‌ప్రియనాథ్, ఉమర్‌ఫారూక్, రవిశంకర్‌గురుజీ, జత్సేత్‌సింగ్, బ్రహ్మకుమారి సుగంధి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంధం మహోత్సవం

పెనుకొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన పెనుకొండ బాబయ్యస్వామి 752వ గంధం మహోత్సవాలు శనివారం తెల్లవారుజామున ఘనంగా ముగిశాయి. తెల్లవారుజామున 3.30గంటలకు దర్గా వంశ పారంపర్య పీఠాధిపతి తాజ్‌బాబా సందల్‌మహల్ నుంచి గంధాన్ని తలపై పళ్లెంలో ఉంచుకుని బాబయ్య దర్గా వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి సమాధివద్ద సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో దేశ విదేశాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వామిని పూజించిన గంధం కోసం భక్తులు ఎగబడ్డారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

రచయిత్రి ఉమాదేవికి సాహితీవేత్తల నివాళి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పరిశోధన గ్రంథ రచయిత్రి చెట్ల ఉమాదేవికి అనంత సాహితీవేత్తలు నివాళులర్పించారు. ఉమాదేవి 13వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరసం ప్రధాన కార్యదర్శి నానీల నాగేంద్ర మాట్లాడుతూ జిల్లా రైతాంగ సమస్యలపై రచయిత్రి ఉమాదేవి రచించిన 'అనంత కరువు - ఇనుప గజ్జెల తల్లి' గ్రంథాన్ని 2003-04 సంవత్సరంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతుకుటుంబాలకు అంకితం చేశారని గుర్తుచేశారు. ఆమె సాహిత్య సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, పూజారి ఈరన్న, అనంత సాహితీ ప్రస్థానం అధ్యక్షుడు గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, కవులు రియాజుద్దీన్, విశ్వనాథ రెడ్డి, పరమేశ్వరరావు, బాలయ్య, సుబ్బరాయుడు, విశాలాంధ్ర బుక్‌హౌస్ విశ్రాంత మేనేజర్ చెట్ల ఈరన్న, ప్రవీణ్‌కుమార్, విశాలాంధ్ర సిబ్బంది పాటిల్ హరీష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఉమాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

లక్షాధికారులను చేయడమే లక్ష్యం: పీడీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి స్వయం సహాయక సంఘం మహిళను లక్షాధికారిని చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య అన్నారు. శనివారం స్థానిక బుడ్డప్పనగర్‌లోని ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో స్త్రీనిధి 18వ మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలను సంస్థాగతంగా బలోపేతం చేయడమే కాకుండా కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలతో జీవనోపాధుల ఏర్పాటు చేసుకుని ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. అదేవిధంగా తీసుకున్న రుణాలకు సంబంధించి మొండి బకాయిల వసూళ్లపైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం రాజధాని అమరావతి నుంచి నిర్వహించి స్త్రీనిధి రాష్ట్రస్థాయి మహాజనసభ నుంచి సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి, సీఈఓ వీరపాండ్యన్, స్త్రీనిధి ఎండి హరిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సమావేశంలో స్త్రీనిధి జిల్లా ఏజీఎం హనుమేష్‌బాబు, 31 మండలాల సమాఖ్యల అధ్యక్షులు, స్త్రీనిధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ. 10

అనంతపురం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 4 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 32వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 32,150 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 12వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 15 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

782 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 782 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 615 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.678 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆఫీస్ ఆటోమేషన్, క్రాఫ్ట్, బ్యూటీషియన్ కోర్సులకు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి లేదా ఇంటర్, ఆపై అర్హత ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మార్చి లేదా ఏప్రిల్ 2025లో అనంతపురం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షలు ఉంటాయన్నారు. వివరాలకు కమలానగర్‌లోని సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలోకానీ, సెల్ నెంబర్లు 9059723829, 7569033379 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

జయప్రదం చేయండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతిని జయప్రదం చేయాలని ఆ శాఖ డీడీ కుష్బూకొఠారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవనంలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 20 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఎక్సైజ్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. పైతోట సమీపంలో మారెమ్మ గుడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు కారులో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. పైతోట గ్రామానికి చెందిన ఎస్ హనుమంతు, రేకులకుంట గ్రామానికి చెందిన వరప్రసాద్, వేపరాల గ్రామానికి చెందిన లింగప్పలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కారు, 20 బాక్సుల మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. వీరిని కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

చోరీకి యత్నం

అనంతపురం క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి బైపాస్‌రోడ్డు సమీపంలోని రిలయన్స్ డిజిటల్ షాప్‌లో దొంగలు చోరీకి యత్నించి విఫలమయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కొందరు గుర్తు తెలియని దుండగులు షాప్‌లోకి చొరబడే యత్నం చేశారు. అక్కడున్న అలారం మోగడంతో పారిపోయారు. మేనేజర్ ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేధిస్తున్నారు..

శింగనమల మండలంలో తమను వేధిస్తున్నారని రాజశేఖర్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నగరంలో అధికారులకు ఫిర్యాదు చేయడానికి వచ్చి మీడియాతో వారు మాట్లాడారు. చిన్నజలాలపురంలో ఎస్సీలపై దురాగతాలు ఏమాత్రం ఆగడం లేదన్నారు. గ్రామంలో పెద్దల సూచనల మేరకు ఆలయానికి చెందిన భూమిలో 70మంది గృహాలు నిర్మించుకుంటుంటే, ఎవరికీ లేని అభ్యంతరం తమకుందని కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ గ్రామ పెద్దల సూచనల మేరకు షెడ్డు వేసుకున్నందుకు దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు.

రేపు ఇస్కాన్‌లో గీతాజయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఇస్కాన్ మందిరంలో సోమవారం గీతాజయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు మందిర చైర్మన్ దామోదర గౌరంగదాస్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా 1008 మంది విద్యార్థులతో సామూహిక భగవద్గీత పారాయణం చేయనున్నట్లు తెలిపారు. పారాయణంలో పాల్గొనే విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య



మృతి చెందిన పురంధర్

రాయదుర్గం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నివాసం ఉంటున్న ఓ ఉపాధ్యాయుడు శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. డీ.హీరేహాళ్ మండలం పులకుర్తి గ్రామానికి చెందిన పురంధర్(42) రాయదుర్గం మండలంలోని టీ వీరాపురం హైస్కూల్‌లో హిందీపండిట్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై విధులకు హాజరు కాకుండా దీర్ఘకాలిక సెలవులో ఉంటున్నాడు. ఇతడి ప్రవర్తనతో విసిగిపోయిన భార్య విడాకులిచ్చి, కుమారుడితో కలిసి పట్టణంలోనే ఉంటోంది. దీంతో పురంధర్ ఒంటరిగా రాయదుర్గంలోనే గ్యాస్‌గోడౌన్ వద్ద నివాసం ఉంటున్నాడు. అయినవారందరూ దూరంగా ఉంటుండటంతో మానసికంగా కృంగిపోయాడు. ఈ నేపథ్యంలో శనివారం రైల్వేస్టేషన్ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటువైపు వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై కట్టెలతో దాడి

అన్నతో గొడవపడి.. తమ్ముడిపై దాడి



గాయపడిన ఫీల్డ్ అసిస్టెంట్ పురుషోత్తం

ధర్మవరంరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్ తిరువీధుల పురుషోత్తంపై అదేగ్రామానికి చెందిన వనం లక్ష్మీ నారాయణ, అతడి కుటుంబసభ్యులు శనివారం కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. బాధితు డు తెలిపిన మేరకు తన అన్న తిరువీధుల దేవేంద్రకు, వనం లక్ష్మీనారాయణకు మధ్య పొలాల వద్ద కొన్నాళ్లుగా రస్తా వివాదం జరుగుతోంది. అయితే శనివారం ఉదయం వనం లక్ష్మీనారాయణ తన అన్న దేవేంద్ర ఇంటివద్దకు వచ్చి రస్తా వివాదంపై గొడవకు దిగి వెళ్లిపోయాడన్నారు. గంట తర్వాత వనం లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు విజయ్‌కుమార్, నరేష్ మరికొందరితో కలిసి తన ఇంటి వద్దకు వచ్చారన్నారు. వచ్చీరాగానే అక్కడ ఉన్న కట్టెలను తీసుకుని ఇంటిబయట ఫీల్డ్‌వర్క్ మస్టర్లను చూసుకుంటున్న తనపై దాడి చేశారన్నారు. ఇంటిలోని కుర్చీలు, సామాన్లు కూడా పగలగొట్టారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. నిన్ను, మీ అన్నను చంపుతాం అంటూ బెదిరించి వెళ్లిపోయినట్లు పేర్కొన్నాడు. ఈ దాడిలో పురుషోత్తం తలకు తీవ్రమైన గాయం కావడంతో కుటుంబసభ్యులు హుటాహుటినా ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో ఎలుగుబంటి మృతి



ఎలుగు బంటికి పంచనామా చేస్తున్న పశువైద్యులు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీ వంక గొల్లలదొడ్డి గ్రామ సమీపంలో విద్యుతాఘాతంతో ఎలుగుబంటి మృతి చెందింది. గ్రామస్థులు ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలిపారు. ఫారెస్ట్ అధికారి విఘ్నేష్ అప్పావుతోపాటు రేంజ్ అధికారి మధుబాబు, డీఆర్వో దామోదర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై గ్రామస్థులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మహిళ ఆత్మహత్య



సువర్ణమ్మ (ఫైల్)

రాయదుర్గం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ వీరాపురం గ్రామానికి చెందిన సువర్ణమ్మ(36) శుక్రవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ బాలరాజు తెలిపారు. సువర్ణమ్మను కణేకల్లుకు చెందిన శ్రీరాములు 18 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఐదు సంవత్సరాల క్రితం భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో గ్రామంలోనే ఓ కిరాణా కొట్టు పెట్టుకుని ఆమె జీవనం సాగిస్తోంది. అయితే తన కుమారుడు హనుమంతరాయుడుతో వివాహేతర సంబంధం పెట్టుకుందని అతడి తల్లి ఎర్రమ్మ, భార్య గంగమ్మ, మరదలు అశ్విని శుక్రవారం సాయంత్రం కొట్టు వద్దకు వచ్చి సువర్ణమ్మతో గొడవకు దిగారు. దీంతో మనస్థాపానికి గురైన సువర్ణమ్మ శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యా చేసుకుంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.





బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర। 7382114647
AJA- 198489

TO-LET

ప్రకాష్ రోడ్డు (కోర్టు రోడ్ ప్రక్కన) 7-111 డోర్‌నెంబర్ యందు వాస్తు అనుసరించి తూర్పు దిక్కున గల ఇల్లు. గ్రౌండ్ ఫ్లోర్ విశాలమైన (1500 చ॥అ) (2BHK) ఇల్లు బాడుగకు కలదు. సంప్ర:7702028043
AJA- 198490

TO-LET

నగరంలోని సుభాష్ రోడ్ నందు గల హెడ్ పోస్ట్ ఆఫీస్ దగ్గర జ్యోతి బుక్ స్టాల్ పక్కన 8-95 డో.నెం. నందు షాప్ (12అx32అ) సైజు కలిగి మూడు అంతస్తుల్లో (G+2), పెంట్‌హౌస్ బాడుగకు కలదు. సంప్ర.9000702363
AJA-198495

PROPERTY FOR SALE

★ Kadiri : Kadiri gandhi nagar 5 Plots total 9.5 cents for Sale, Clear Property. Contact : 8095656067, 9966587910
AJH-1246



REAL ESTATE

B.K.S.కు దగ్గరలో తక్కువ ధరలో డెవలప్‌మెంట్‌తో EMI లో ప్లాట్స్ కలవు. మార్కెటింగ్‌కు స్త్రీ, పురుషులు కావలెను. అడ్వాన్స్+ శాలరీ+ కమీషన్. సెల్ :8886112129
AJA-198494

WANTED

అనంతపురం పట్టణం నందు కళ్యాణదుర్గం బైపాస్ దగ్గరలో ప్రైవేట్ బ్యాంకులో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేయుటకు కావలెను. గమనిక 10th పాసై వుండాలి. జీతం:11,000 మరియు అదికముగా PF and ESI ఉండును.8 గంటలు డ్యూటీ సెల్:9381838140,8977731455
AJA- 198492

WANTED

Marketing executives and marketing managers and senior marketing managers. Fixed salary and incentives. Contact : D.Nandu(BDM), **cell:8142322861.**
AJA-Sathish

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - పబ్లిసిటీ

సజావుగా సాగునీటి సంఘం ఎన్నికలు



ఎన్నికైన కందుకూరు సాగునీటి సంఘం సభ్యులు



ఆలమూరు సాగునీటి సంఘానికి ఎన్నికైన సభ్యులు



పొడరాళ్ల సాగునీటి సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌తో నాయకులు

అనంతపురం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం సజావుగా జరిగాయి టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలం పరిధిలోని కందుకూరు సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా పోతులయ్య, రాగే బాలాజీ ఎన్నిక కాగా.. ఆలమూరు సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్ క్రిష్ణయ్య, బి నాగేశేషారెడ్డి ఎన్నికయ్యారు. అదేవిధంగా శింగనమల మండలం పొడరాళ్ల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా మండలంలోని పాముదాయి గ్రామానికి చెందిన రామ్మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



రాప్తాడులో సాగు నీటి సంఘం అధ్యక్షులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు



డిక్లరేషన్ అందుకుంటున్న సాకే తిరుపాలమ్మ

రాప్తాడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు గ్రామాల్లో నిర్వహించిన సాగు నీటి సంఘం ఎన్నికల్లో అన్ని చోట్లా టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాప్తాడు సాగు నీటి సంఘం అధ్యక్షురాలిగా సాకే తిరుపాలమ్మ, ఉపాధ్యక్షుడిగా అద్ర ఎర్రగుంటప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే గాండ్లపర్తి సంఘం అధ్యక్షుడిగా బత్తల జయచంద్ర, ఉపాధ్యక్షుడిగా ఎర్రగుంట ఉప్పర పోతన్న, పాలచెర్ల అధ్యక్షుడిగా బోగినేపల్లికి చెందిన పెనకలపాటి లక్ష్మన్న, ఉపాధ్య క్షుడిగా బండమీదపల్లి బోయ అక్కులప్ప, ఎం. చెర్లోపల్లి అధ్యక్షుడిగా మరూరు ఉమాపతి, ఉపాధ్యక్షుడిగా చెర్లోపల్లి రామలక్ష్మిని ఎన్నుకున్నారు. బుక్కచెర్ల అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పుల్లన్న, చాపట్ల అధ్యక్షుడిగా చాపట్ల కుమార్, ఉపాధ్యక్షుడిగా మరూరు రాముడిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.




మద్దలచెరువు చైర్మన్, సభ్యులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

కనగానపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం సాగునీటి సంఘం చైర్మన్‌గా దాసరి కిష్టయ్య, వైస్‌చైర్మన్‌గా పసల నరసింహులు, తూంచెర్ల సంఘం చైర్మన్‌గా యాతం జయరాములు, వైస్‌చైర్మన్‌గా వెంగముని నాయుడు, బద్దలాపురం చెరువు చైర్మన్‌గా వెంకటరాముడు, వైస్‌చైర్మన్‌గా తుమ్మల శంకర్‌ను ఎన్నుకున్నారు. అలాగే కోనాపురం చెరువు చైర్మన్‌గా తరిగోపుల వెంకటమ్మ, వైస్‌చైర్మన్‌గా పత్తిపాటి రామాంజినేయులు, తల్లిమడుగుల చెరువు చైర్మన్‌గా సరిపూటి వెంకటనారాయణ, వైస్ చైర్మన్‌గా వరదాగణపతితో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా అప్పర్‌పెన్నార్ ప్రాజెక్టు కింద మద్దలచెరువు సంఘానికి చైర్మన్‌గా కె రామయ్య, వైస్‌చైర్మన్‌గా వరప్రసాదు, తగరకుంటకు చైర్మన్‌గా నరసింహులు, వైస్‌చైర్మన్‌గా గోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



నాగసముద్రం రెండు చెరువులకు ఎన్నికైన చైర్మన్, వైస్‌చైర్మన్‌లు

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం చెరువు అధ్యక్షుడిగా ఆదిశేషయ్య, ఉపాధ్యక్షురాలిగా నారాయణమ్మ, గంగినేపల్లిచెరువు అధ్యక్షుడిగా చిరంజీవమ్మ, ఉపాధ్యక్షుడిగా నారాయణస్వామి, కనుముక్కల ఎర్రచెరువు అధ్యక్షుడిగా నారాయణ స్వామి, ఉపాధ్యక్షుడిగా పుల్లన్నను ఎన్నుకున్నారు. అలాగే కనుముక్కల పెద్దచెరువు అధ్యక్షుడిగా ఉమామహేశ్వర్, ఉపాధ్యక్షుడిగా నల్లప్ప, ముష్టికోవెల అధ్యక్షుడిగా చలపతి, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీదేవి, న్యామద్దల అధ్యక్షురాలిగా లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షుడిగా అక్కులప్ప, హరి యన్ చెరువు అధ్యక్షుడిగా వారాదప్ప, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. నాగసముద్రం చెరువు చిక్కవడియార్ చెరువు అధ్యక్షు డిగా రేపటిగోవిందు, ఉపాధ్యక్షుడిగా చిత్రా కాటమయ్య, నాగసముద్రం చిన్నచెరువు అధ్యక్షుడిగా దండు వెంకటమ్మ, ఉపాధ్యక్షుడిగా గంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



శింగనమల సంఘానికి ఎన్నికైన కూటమి మద్దతు దారులు సంబరాలు

శింగనమల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలలో కూటమి మద్దతుదారులు ఏకగ్రీవ మయ్యారు. మండలంలో శింగనమల ఆయకట్టు సంఘం అధ్యక్షుడిగా గార్లదిన్నె సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పత్రా ఎర్రిస్వామి ఎన్నికయ్యారు. తరిమెల అయకట్టు అధ్యక్షుడిగా నిదనవాడకు చెందిన కుమ్మెత చంద్రాయుడు, ఉపాధ్యక్షుడిగా దండు లక్ష్మీనారాయణ, కుల్లుమడి అధ్యక్షుడిగా ఓబుళరాజు, ఉపాధ్యక్షుడిగా వేణుగోపాల్, నలకంచెరువు ఆయకట్టు అధ్యక్షుడిగా బాల నంజీవులు, ఉపాధ్యక్షుడిగా చిన్న ఆశ్వత్థ ఎన్నికయ్యారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

నార్పల, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పరంధామ, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి, మరో పది మంది టీసీ సభ్యులుగా ఏకగ్రీవం చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ప్రత్యేక చొరవతో ఏకగ్రీవం చేశారు. తమపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవులను అప్పగించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, టీడీపీ నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, ఆకుల ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్ధంతరంగా అంగన్‌వాడీ భవనాలు



హంపాపురంలో పిల్లర్లకే పరిమితమైన అంగన్‌వాడీ కేంద్రం

రాప్తాడు, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ... చిన్నారులకు ప్రాథమిక విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్ వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు అర్ధంతరంగానే నిలిచిపోయాయి. సకాలంలో బిల్లులు కాలేదని కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపి వేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో మండలంలోని కొన్ని అంగన్‌వాడీ భవనాలు పిల్లర్ల దశలో ఉండి దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా అంగన్‌వాడీ భవనాలను గ్రామంలోని ఇతర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు.

పిల్లర్ల దశలోనే ...

మండలంలోని హంపాపురం, అయ్యవారిపల్లి, బండ మీదపల్లి గ్రామాల్లో గత వైసీపీ ప్రభుత్వం 2021లో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవనాన్ని దాదాపు రూ. 8 లక్షలతో ని ర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా గ్రామాల్లో అప్పటి వైసీపీ నాయకులే కాంట్రాక్టు దక్కించుకుని, పనులు ప్రారంభించారు. హంపాపురంలో పిల్లర్లు వేసి ఆరు అడుగుల గోడ కట్టారు. చేసిన పనులకు దాదాపు రూ. 2 లక్షల వరకు బిల్లు కాంట్రాక్టరు ఖాతాలో జమ అయింది. ఆ తరువాత పనులు నిలిపి వేశారు. దీంతో భవనంలో కేంద్రం నిర్వహిస్తున్నారు. రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. హంపాపురంలోని మరో అంగన్వాడీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రాథమిక పాఠశాల భవనంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. అయ్యవారిపల్లిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో అంగన్‌వాడీ నూతన భవనం నిర్మాణం ప్రారంభించి, మధ్యలోనే నిలిపివేశారు. సొంత భవనం లేక చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. బండమీదపల్లిలో నూతన భవనం పనులు 80 శాతం పూర్తి చేసి నిలిపివేయడంతో ఆ భవనం నిరుపయోగంగా ఉంది. సొంత భవనం లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. గత వైసీపీ పాలకులు, అధికారులు అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పట్ల శ్రద్ధ చూపకపోవడంతో పూర్తి కాలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిలిచిపోయిన అంగన్వాడీ భవన నిర్మాణాలు పూర్తవుతాయని ఆయా గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. గత టీడీపీ హయాంలో పరిటాల సునీత మంత్రిగా ఉన్నప్పుడు రాప్తాడు నియోజకవర్గంలో అనేక నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేయించారు. మళ్లీ కూటమి అధికారంలోకి రావడంతో మధ్యలో నిలిచిపోయిన భవనాలును ఎమ్మెల్యే పూర్తి చేయిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

అంగన్‌వాడీ భవన నిర్మాణాల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, నాగరత్న తెలిపారు. సొంత భవనాలు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో ప్రస్తుతం ప్రభుత్వ భవనాలు, అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

బాధ్యత మరచిపోకండి

● సాగునీటి సంఘం సభ్యులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి):ఇవి పదవులు కాదు.. బాధ్యతలన్నది మరచిపోవద్దని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. నియోజకవర్గంలో శనివారం ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ మెంబ ర్లు నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. నియోజకవర్గంలోని 27చెరువులు, ఐదు సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం కావడంపై ఎమ్మెల్యే, పరిటాల శ్రీరామ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించిన విధంగా మనం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. గ్రామాల్లో అంతా కలసి కట్టుగా ఉంటూ పంటలు సాగుచేసుకోవాలన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికైన కూటమి మద్దతుదాలకు ఎమ్మెల్యే శనివారం రాత్రి అభినందనలు తెలిపారు. శింగనమల ఆయకట్టు అధ్యక్షుడు గార్లదిన్నె సత్యనారాయణ ఉపాధ్యక్షుడు పత్రా ఎర్రిస్వామి, తరిమెల ఆయకట్టు అధ్యక్షుడు నిదనవాడ కుమ్మెత చంద్రాయుడు, ఉపాధ్యక్షుడు దండు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు దండు శ్రీనివాసులు, నాగముని, విశ్వనాథరెడ్డి, పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు ఎమ్మెల్యేని నగరంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిశారు. రైతుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

కూటమి మద్దతు దారుల ఏకగ్రీవం



గార్లదిన్నె కమిటీ నాయకులను అభినందిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి



డిక్లరేషన్ ఫారాలు అందజేస్తున్న గార్లదిన్నె, జంబులదిన్నె చైర్మన్లు

గార్లదిన్నె, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలంలోని దక్షిణ కాలువ ఆయకట్టు పరిధిలోని 3, 5, 8 డిస్ట్రిబ్యూటరీలకు, నాలుగు చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. కూటమి మద్దతు దారు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గార్లదిన్నె సాగునీటి సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖర్, వైస్ చైర్మన్‌గా మదిరేపల్లి వెంకరమణ, యర్రగుంట్ల సంఘం చైర్మన్‌గా మోదుపల్లి అరవింద్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా మ ర్తాడుకు చెందిన శ్రీనివాసులు, ఇల్లూరు అధ్యక్షురాలిగా బి. సుజాత, వైస్ చైర్మన్‌గా మాలపాటి రోషన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జంబులదిన్నె చెరువు చైర్మన్‌గా రాంభూపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా గిరిరెడ్డి, బ్రాహ్మణపల్లి (మర్తాడు) చెరువు చైర్మన్‌గా వేలూరి కిష్టప్ప, వైస్ చైర్మన్ షబానా, పెనక చెర్ల చెరువు చైర్మన్‌గా రామిరెడ్డి, వైస్ చైర్మన్‌గా నిరంజన్‌రెడ్డి, యర్రగుంట్ల చెరువు చైర్మన్‌గా శంకరయ్య, వైస్ చైర్మన్‌గా నారాయణప్ప ఎన్నిక య్యారు.



అప్పర్‌పెన్నార్ సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షులతో టీడీపీ నాయకులు

రామగిరి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని అప్పర్‌పెన్నార్ సాగునీటిసంఘం అధ్యక్షుడిగా కురుబ లక్ష్మీనారాయణరెడ్డి(అప్పిరెడ్డి), ఉపాధ్యక్షుడిగా నరసింహులు ఏకగ్రీవంగా ఎంపిక య్యారు. అదేవిధంగా రామగిరి సాగునీటిసంఘం అధ్యక్షురాలిగా పూజారి సావిత్రమ్మ, ఉపాధ్యక్షుడిగా బెస్త శ్రీనివాసులు(పేపర్‌శీన), నసనకోట సంఘం అధ్యక్షుడిగా ఎన్ గురురాజు, ఉపాధ్యక్షుడిగా కురుబ మహేశ్, కుంటిమద్ది అధ్యక్షుడిగా కొడిదల హర్షవర్దన్, ఉపాధ్యక్షుడిగా బడముక్కల వారాదయ్య ఎన్నికయ్యారు. గంతిమర్రి సంఘం అధ్యక్షుడిగా కందక నారాయణస్వామి, ఉపాధ్యక్షుడిగా మద్దిలి శివయ్య, పేరూరు పెద్దచెరువు అధ్యక్షుడిగా సాకే నాగేంద్ర, ఉపాధ్యక్షుడిగా మంగన్న ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉద్యోగోన్నతుల్లో న్యాయం చేయండి

●ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాల ప్రకారం న్యాయం చేయాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశం కర్ కోరారు. ఆయన శనివారం హైదరాబాద్ లో ని ఓ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలోని విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు జాతీ య ఎస్టీ కమిషన్ ఆదేశాలను అమలు చేయాలని కోరారు. ఇదే విషయాన్ని గతంలో సుప్రీంకోర్టు సైతం ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. తెలంగాణలో ఉన్న ఏపీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

పెన్షనర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయండి

● సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్నగౌడ్



మాట్లాడుతున్న పెద్దన్నగౌడ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించే పెన్షనర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ పెన్షన ర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్నగౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం కార్యాలయంలో పెద్దన్నగౌడ్ విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ నెల 17వ తేదీ జిల్లా కేంద్రం లోని లలితకళా పరిషత్‌లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లు, సభ్యులను సన్మానించనున్నట్లు తెలిపారు. కావున ఉమ్మడి జిల్లాలోని పెన్షనర్లందరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపటి నుంచి పీవీకేకే ఐటీలో జాతీయ స్థాయి ఎఫ్‌డీపీ

అనంతపురంరూరల్,డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ)ను ఏఓ ఇంటిగ్రేటెడ్ నెక్ట్ జనరేషన్ సెమీ కండక్టర్ డివైసెస్ అనే అంశంపై నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ తెలిపారు. ఈ మేరకు శనివారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎఫ్‌డీపీ ద్వారా సెమీకండక్టర్ టెక్నాలజీలో కొత్త ట్రెండ్స్, ముఖ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క పాత్ర, అన్వయంపై లోతైన అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యాసాలు, ప్రాజెక్టుల వివరాలు, తాజా ఆవిష్కరణలు, పరిశోధనలపై ప్రత్యేక చర్చ జరుగుతుందన్నారు. వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి కిరణ్‌కుమార్, లక్ష్మీనరసప్ప, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సీనియర్ బాక్సింగ్‌కు క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా స్థాయి బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు శనివారం స్థానిక అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్ తెలిపారు. కార్తిక్, ఉమేష్, అనీఫ్, మధుసూదన్, షాలెన్‌రాజు, మైనుద్దీన్, చరణ్‌తేజ్, మల్లికార్జున ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో పిఠాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడి అరెస్ట్

రాప్తాడు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో పురుషోత్తంరెడ్డి (25) హత్య కేసును ఛేదించినట్లు రాప్తాడు సీఐ శ్రీ హర్ష తెలిపారు. స్థానికి పోలీస్ స్టేషన్‌లో ఆయన శనివారం వివరాలను వెల్లడించారు. 2024వ సంవత్సరం ఏప్రిల్ 10 వ తేదీన సాయంత్రం 4 గంటలకు బుక్కచెర్ల గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి కళ్లం దొడ్డిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అదే గ్రామానికి చెందిన జలగాని నల్లపరెడ్డి రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు రాప్తాడు పోలీసులు విచారణ చేపట్టారు. జలగాని నల్లపరెడ్డికి పురుషోత్తంరెడ్డి వరుసకు మేనల్లుడు. పురుషోత్తంరెడ్డిపని పాటా లేకుండా తిరుగుతూ ఇంటిలో కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. 2024 ఏప్రిల్ 20న అతడు జలగాని నల్లపరెడ్డి చెల్లెలు కవితతో గలాటా పడి ఆమెను కొట్టాడు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు పురుషోత్తంరెడ్డి కళ్లం దొడ్డిలోని పశువుల కొట్టం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో జలగాని నల్లపరెడ్డితో ఘర్షణ జరిగింది. పురుషోత్తం రెడ్డిని నల్లపరెడ్డి చెంపపై బలంగా కొట్టడంతో పురుషోత్తంరెడ్డి పశువుల పాకలో నాటిన ఇనుప పైపునకు కొట్టుకుని కింద పడిపోయి మాట్లాడలేదు. పురుషోత్తంరెడ్డి మెడకు చీర గుడ్డతో చుట్టి మెడకు ఉరి వేసి హత్య చేశాడు. పోలీసుల విచారణలో పురుషోత్తంరెడ్డిని హత్య చేసినట్లు జలగాని నల్లపరెడ్డి ఒప్పుకోవడంతో శనివారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు సీఐ తెలిపారు.

ఆచూకీ లభ్యం

నార్పల, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నార్పలకు చెందిన డ్రైవర్ రాఘవ వారం కిందట అదృశ్యమయ్యాడు. ఎస్ఐ సాగర్ ప్రత్యేక పోలీస్ టీంతో గాలింపు చర్యలు చేపట్టగా శనివారం అనంతపురం చెరువు కట్ట వద్ద కనబడ్డాడు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్థిక సమస్యల వేధింపులు తాళలేక అదృశ్యమైన ట్లు పోలీసుల ఎదుట అతడు వాపోయాడు. వెంటనే డ్రైవర్ రాఘవను తహసీల్దారు అరుణకుమారి వద్ద హాజరు పరచి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో పాటు ధైర్యంగా ఉండాలని పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.

కూటమి జయకేతనం



సిద్దరాంపురం అధ్యక్షుడుని అభినందిస్తున్న రామలింగారెడ్డి



కొర్రపాడులో డిక్లరేషన్ ఫాం తీసుకుంటున్న సోమశేఖర్

బుక్కరాయసముద్రం, డిసెంబరు14: మం డలంలో చెదరుమదురు సంఘటనలు మినహా సాగు నీటి సంఘం, మైనర్‌ఇరిగేషన్, హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీ సంఘాల చైర్మన్ల ఎన్నికలు ప్ర శాంతంగా జరిగాయి. అన్నింటికి టీడీపీ మద్దతు దారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హెచ్చె ల్సీ ఆయకట్టు కింద ఉన్న పొడరాళ్ల సంఘం చైర్మన్‌గా పాముదాయి రామ్మోహన్, జంతు లూ రుకు సూర్యప్రకాష్‌రెడ్డి, కొర్రపాడుకు రాచమల్ల సోమశేఖర్, చెన్నంపల్లికి ఆలం నాగార్జున ఏకగ్రీవమయ్యారు. సిద్దరాంపురం చెరువుకు సంబంధించి టీడీపీలోని రెండు వర్గాల మధ్య తొ లుత పోటీ నెలకొంది. దీంతో అనంతపురం రూ రల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు అధ్వర్యంలో ఇటుకల పల్లి సీఐ హేమంత్ కుమార్, స్పెషల్ పార్టీ సిబ్బందితో పాటు మరో 30 మంది పోలీసుల బందో బస్తు చేపట్టారు. చివరికి మరో వర్గం వారు పోటీకి దూరం కావడంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలిం గారెడ్డి మద్దతుదారుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెరువుల చైర్మన్లు: బుక్కరాయసముద్రం చెరువు అధ్యక్షుడిగా వీ నారాయణస్వామి, నారాయణప్ప చెరువుకు చిన్నచితంబరి, సిద్దరాం పురం చెరువుకు శివయ్య, ఏడావులపర్తికి గోపాల్‌రెడ్డి, కేకేఅగ్రహారానికి చంద్రశేఖర్, చె న్నంపల్లి తూర్పు చెరువుకు నీలమ్మ , పడమటి చెరువుకు శ్రీకాంత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన చెరువుల చైర్మన్లు, హెచ్చెల్సీ ఆయకట్టు చైర్మన్లకు ఎమ్మెల్యే బండా రు శ్రావణిశ్రీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్‌కుమార్, జిల్లా టీడీపీ నేత పసుపుల శ్రీరామిరెడ్డి అభినందనలు తెలిపారు.

● ఆత్మకూరు: మండల పరిధిలోని బి యాలేరు సాగునీటి సంఘం చైర్మన్‌గా బండి ముసలన్న, వైస్ చైర్మన్‌గా సాలప్ప, మదిగుబ్బ సాగునీటి సంఘం చైర్మన్‌గా జింకల రంగప్ప, వైస్ చైర్మన్ చిత్రా నాగభూషణం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ లక్ష్మనాయక్ తెలిపారు. ఎన్నికల అనంతరం వారు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షిప్తం

నేడు విద్యుత్ అంతరాయం

రాప్తాడు, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ శివప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రాప్తాడు, గంగలకుంట, అయ్యవారిపల్లి, గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు, రామినేపల్లి, హంపాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం నగర శివారులో బెంగళూరు రోడ్డులో ఉన్న శివకోటి దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ వ్రతాన్ని నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

కోటంక చెరువును నింపండి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గార్లదిన్నె మండలం కోటంక గ్రామ చెరువును హంద్రీనీవా నీటితో నింపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కూడేరు మండలం పొడి చెరువు గ్రా చెరువు నుంచి కోటంక గ్రామ చెరువుకు సహజ వంక ఉందని, దానిద్వారా నీరు ఇవ్వాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ రెండు గ్రామాల రైతులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

అనంతపురం విద్య, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలసదన్ విద్యార్థులకు శనివారం దుస్తులు అందజేశారు. ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి శివ, ఆయన సతీమణి వైష్ణవి, ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మ ఆధ్వర్యంలో పిల్లలకు కొత్త దుస్తులు అందజేశారు. వారితో కొంతసేపు ఆనందంగా గడిపారు. ఎస్ఎస్‌బీఎన్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ రమేష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యామూర్తికి నృత్యతపస్వి అవార్డు



అవార్డు అందుకుంటున్న సంధ్యామూర్తి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన శ్రీ నృత్య కళానిలయం నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి నృత్య తపస్వి అవార్డు అందుకున్నారు. అభినయ నృత్యభారతి 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఏలూరులో వివిధ రంగాలకు చెం దిన పలువురికి అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా సంధ్యామూర్తికి అభినయ నృత్యభారతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మనోహర్ గోపాల్, గౌరవాధ్యక్షుడు యార్లగడ్డ జగన్మోహనరావు చేతులమీదుగా అవార్డును అందజేసి సత్కరించారు.

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌కు వినతులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు సంస్థ జోనల్ చైర్మన్ పూల నాగరాజును కలిసి సమస్యలు విన్నవించారు. అనంతపురానికి శనివారం వచ్చిన జోనల్ చైర్మన్‌ను ఆయన చాంబర్‌లో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జి ల్లా అధ్యక్షుడు సూరిబాబు, డిపో కార్యదర్శి రామాంజనేయులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతపురం డీఎం కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్టీసీ కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు జోనల్ చైర్మన్ పూలనాగరాజును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. బస్సు టైర్ల డ్యామేజ్, అధిక కేఎంపీఎల్ వేధింపులు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ ప్రాంతీయ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వెంకటేశులు, ప్రచార కార్యదర్శి పరమేశ్వర్, అనంతపురం డిపో అధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా నాకక్షిదాడు తాటి రాజశేఖర్ తండ్రి తాటి బసయ్య సర్వే నం.164/2 & సర్వే నెం. 168/2 కు సంబంధించి ఎ.సి. 0.04 ప్లాట్ నెంబరు 96 జి.రాజేష్ గారి నుండి విక్రయ దస్తావేజు 23-08-2017 Vide Doc.No: 7526/2017 కొన్నారు. సదరు ఆస్తి నారాయణాపురం గ్రామము పొలం. సదరి ఆస్తిని కొన్నపుడు నాకక్షిదారునికి సదరి ఆస్తికి సంబంధించి లింక్ విక్రయ దస్తావేజు 08.12.1982 Vide Doc.No: 9627/1982 కనబడుట లేదు. దానికి సంబంధించి పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వదలచినాము. నా కక్షిదారుడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ADB కళ్యాణదుర్గం రోడ్డు SBI బ్రాంచ్ నందు ఋణము పొందులకు తగిన ఏర్పాట్లు చేసుకొన్నారు. కావున పై కనబరచిన విక్రయ దస్తావేజు (ORiginal) 08.12.1982 Vide Doc.No:9627/1982 ఎవరికయినా దొరికిన ఎడల క్రింద కనబరచిన అడ్రస్‌కు అందించవలసినది గా తెలుపడమైనది. ఈ ప్రకటన వెలువ డిన 7 రోజుల లోపల ఎలాంటి సమాచా రము లేక పోయిన ఎడల బ్యాంకు వారు ఋణము ఇచ్చుటకు ముందుకు పోతారు అని తెలియజేయడమైనది.

ఎ.యస్. గురుప్రసాద్
అడ్వకేట్, ఇంటి నెంబరు 21/131,
పాతవూరు, అనంతపురము-515005
సెల్: 94407 77779

క్లుప్తంగా..

ఏకగ్రీవం.. ప్రశాంతం..!

కూటమి వశమైన సాగునీటి సంఘాలు



డిక్లరేషన్ అందుకుంటున్న నందలపాడు ఆయకట్టు అధ్యక్షుడు మురళీ

తాడిపత్రి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో 5 మైనర్ ఇరిగేషన్ , 4 మేజర్ ఇరిగేషన్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఇందులో మేజర్ ఇరిగేషన్ కింద నందలపాడు డిస్ట్రిబ్యూటర్ ఆయకట్టు అధ్యక్షుడిగా కూరపాటి మురళి, ఉపాధ్యక్షుడిగా కూరపాటి సుధాకర్‌నాయుడు, దిగువపల్లి డిస్ట్రిబ్యూటర్ ఆయకట్టు అధ్యక్షుడిగా చిలమకూరు దామోదర్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా ఎద్దుల లక్ష్మీనాగలింగేశ్వర రెడ్డి, చిన్నపొలమడ అధ్యక్షుడిగా రామకృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా నాగేశ్వర రెడ్డి, పెద్దపొలమడ అధ్యక్షుడిగా పల్లా పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా వెంకటక్రిష్ణయ్య ఎన్నికయ్యారు. మైనర్ ఇరిగేషన్ కింద ఆలూరు చెరువు ఆయకట్టు అధ్యక్షుడిగా పల్లె వీరరాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కృష్ణవేణి, భోగసముద్రం అధ్యక్షుడిగా చిన్నఅక్కిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చౌదరి, వెంకటాంపల్లి అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొండారెడ్డి, బ్రాహ్మణపలి అధ్యక్షురాలిగా మహాలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా నాగన్న, వంగనూరు అధ్యక్షుడిగా శివారెడ్డి, ఉపాధ్యక్షడి వెంకటసుబ్బరాయుడు ఎన్నికయ్యారు. వీరంతా టీడీపీ మద్దతుదారులే కావడం గమనార్హం.

యాడికి: మండలంలోని రాయలచెరువు సాగునీటి సంఘం అధ్యక్షురాలిగా మదమంచి నాగోశేషమ్మ, ఉపాధ్యక్షుడిగా తోళ్ల నాగరాజును , పిన్నేపల్లి అధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పుల్లారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ మద్దతుదారులైన వీరిని మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్ అభినందించారు.

పెద్దవడుగూరు: మండలంలో ఐదు సాగు నీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. అందరూ టీడీపీ మద్దతుదారులు ఎన్నికయ్యారు. దిమ్మగుడి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా కె. రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె. సూర్యనారాయణరెడ్డి పెద్దవడుగూరు అధ్యక్షుడిగా పి. రవిశంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వై. మోహనకృష్ణారెడ్డి, గజరాంపల్లి అధ్యక్షుడిగా పి. జయప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా వి.భూమిక, అప్పేచర్ల అధ్యక్షుడిగా గుర్రపు వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా గుర్రపు వెంకటనారాయణ, చిత్రచేడు అధ్యక్షుడిగా కె. నాగేశ్వర, ఉపాధ్యక్షుడిగా పి.లచ్చప్ప ఎన్నికైనట్లు తహసీల్దార్ ఉషారాణి తెలిపారు.

పుట్లూరు: మండలంలోని పుట్లూరు, శనగలగూడూరు, కడవకల్లు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు అధికారులు వెల్లడించారు. పుట్లూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రవికుమార్‌రెడ్డి, కడవకల్లు అధ్యక్షుడిగా శ్రీనివాసనాయుడు, ఉపాధ్యక్షుడిగా లింగమూర్తి, శనగలగూడూరు అధ్యక్షుడిగా నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రంగనాథ్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరందరూ టీడీపీ మద్ధతుదారులు.

యల్లనూరు: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. కల్లూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా వెంకటనాయుడు, ఉపాధ్యక్షుడుగా ఎం. రాజశేఖర్‌రెడ్డి, యల్లనూరు అధ్యక్షుడుగా ఆదిశేషులనాయుడు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, తిరుమలాపురం అధ్యక్షుడిగా ప్రమీలమ్మ, నారాయణస్వామి, వేములపల్లి అధ్యక్షుడిగా సదాశివారెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామాంజులు ఎన్నికయ్యారు.



కణేకల్లు చెరువు సంఘం కమిటీ సభ్యులు

రాయదుర్గంరూరల్: రాయదుర్గం మండలంలో వేపరాల చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా రాఘవేంద్రగౌడ్, ఉపాధ్యక్షుడిగా సిద్దన్న, టీఎస్‌హళ్లి చెరువు అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా గోపాలప్ప, నాగిరెడ్డిపల్లి అధ్యక్షుడిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జునలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అందరూ టీడీపీ మద్దతుదారులేనని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. టీఎస్‌హళ్లి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసులు రాయదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులును కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

బొమ్మనహాళ్: మండలంలో హరేసముద్రం కాలువ సంఘం అధ్యక్షుడిగా పయ్యావుల హనుమన్న, ఉపాధ్యక్షుడిగా చంద్రగిరి హనుమంతరెడ్డి, బండూరు కాలువ అధ్యక్షుడిగా ఈ నాగరాజు, ఉపాధ్యక్షుడిగా వేలూరు గోవింద, ఉద్దేహాళ్ అధ్యక్షుడిగా రావి రాజేష్, ఉపాధ్యక్షుడిగా లాలెప్ప, కొళగానహళ్లి అధ్యక్షులుగా బీ గోపాల్, ఉపాధ్యక్షుడిగా కే వన్నూరుస్వామి, శ్రీధరఘట్ట అధ్యక్షుడిగా కొండాపురం కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, కళ్లదేవనహళ్లి అధ్యక్షుడిగా సుంకన్న, ఉపాధ్యక్షుడిగా ముక్కన్న, బొల్లనగుడ్డం అధ్యక్షుడిగా చిన్న తిమ్మప్ప, ఉపాధ్యక్షుడిగా జగదీష్, శ్రీధరఘట్ట చెరువు సంఘం అధ్యక్షుడిగా కృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఉప్పర వెంకటేశులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరూ టీడీపీ మద్దతుదారులే. తహశీల్దార్ మునివేలు వీరికి డిక్లరేషన్ ఫారాలు అందజేశారు.

కణేకల్లు: కణేకల్లు చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు అధ్యక్షుడిగా బీటీ రమేష్, ఉపాధ్యక్షుడిగా తిప్పేస్వామి, కొత్తపల్లి కృష్ణారెడ్డి చెరువు సంఘం అధ్యక్షుడిగా రామిరెడ్డి, 7వ డిస్ట్రిబ్యూటరీ సంఘం అధ్యక్షుడిగా దేవేంద్ర, ఉపాధ్యక్షుడిగా రసూల్‌సాబ్, కళేకుర్తి చెరువు సంఘం అధ్యక్షుడిగా ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడిగా నాగభూషణం, 6 బీ డిస్ట్రిబ్యూటరీ సంఘం అధ్యక్షులుగా బోయ శంకర్ ఎన్నికయ్యారు. వీరందరూ టీడీపీ మద్దతుదారులేనని అధికారులు తెలిపారు.

గుమ్మఘట్ట: మండలంలో బీటీపీ ఎడమ కాలువ పరిధిలో గల గుమ్మఘట్ట, కలుగోడు, బేలోడు, భూపసముద్రం సాగునీటి సంఘాలకు రంగసముద్రం, పూలకుంట చెరువుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా కూటమి మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుమ్మఘట్ట సాగునీటి సంఘం అధ్యక్షురాలుగా జనసేన మద్దతుదారు పార్వతమ్మ, ఉపాధ్యక్షుడిగా గోనబావికి చెందిన పరమేశ్వరప్ప ఎన్నికయ్యారు. కలుగోడు అధ్యక్షుడిగా కాలవ నాగరాజు, ఉపాధ్యక్షులుగా హరిజన్న అంపక్క, బేలోడు అధ్యక్షుడిగా ఎస్. రామప్ప, ఉపాధ్యక్షుడిగా కోడికపల్లి తిప్పేస్వామి, భూపసముద్రం అధ్యక్షుడిగా నాగేందప్ప, ఉపాధ్యక్షుడిగా తిమ్మప్ప , రంగసముద్రం చెరువు సంఘం అధ్యక్షుడిగా జయరాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా శివారెడ్డి, పూలకుంట అధ్యక్షుడిగా తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడిగా రుద్రముని ఎన్నికయ్యారు.

డీ.హీరేహాళ్: మండలంలోని మల్లికేతి, మడేనహళ్లి, దొడఘట్ట, గొడిశలపల్లి సాగు నీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మల్లికేతి అధ్యక్షుడిగా పల్లయ్య, మడేనహళ్లికి పెద్ద తిప్పయ్య, దొడఘట్టకు బోయ రమాదేవి, గొడిశలపల్లికి బ్రహ్మానందరెడ్డి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వీరందరూ టీడీపీ మద్దతుదారులు.

ఉత్కంఠకు తెర..

యల్లనూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): యల్లనూరు సాగునీటి సంఘం ఎన్నికల్లో వైసీపీ పార్టీ పోటీలో అభ్యర్థులను నిలుపుతారని ప్రచారం జరగడంతో ఉదయం 9గంటల వరకు ఉత్కంఠ నెలకొంది. అయితే జడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాప్‌రెడ్డి అభ్యర్థులను వెంటబెట్టుకొని యల్లనూరు వస్తున్నారని తెలిసి రూరల్ సీఐ సత్యబాబు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి వారు పోలింగ్ కేంద్రానికి రాకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు. దీంతో టీడీపీ మద్ధతుదారులు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.

సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసిన వైసీపీ

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలో జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు, కమిటీ సభ్యులను శనివారం సాయంత్రం ఆయన రంగాపురం క్యాంపులో సమావేశ పరచి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి కాలువల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసి రైతులను ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. నీటిప్రాజెక్టుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ సాగునీటి సంఘాలను తీసుకొచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం హెచ్చెల్సీతో పాటు చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, క్లస్టర్ ధనుంజయ, టీడీపీ సీనియర్ నాయకులు అప్పారావు, తిమ్మరాజు, చలపతి, పయ్యావుల నాగరాజు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రంగాపురం క్యాంపులో సాగునీటి సంఘాల అధ్యక్షులతో కాలవ శ్రీనివాసులు

కూటమి అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నిక చారిత్రాత్మకం

కణేకల్లు: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సాగునీటి ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతుదారులు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం చారిత్రాత్మకమని కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని సాగునీటి సంఘాలకు ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో శుక్రవారం సాయంత్రం ఆ పార్టీ తాము ఎన్నికలకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటన చేసి కపట నాటకానికి తెరలేపిందన్నారు. అనంతరం సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించారు.

ఘనంగా దత్తజయంతి

తాడిపత్రి/ గుంతకల్లు టౌన్/ గుత్తి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి పట్టణంలోని శివాలయం రోడ్డులో ఉన్న శ్రీ గురు దత్తాత్రేయ మందిరంలో శనివారం స్వామి వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, గురుదత్తాత్రేయ వ్రతం, నవగ్రహ హోమం, గణపతిహోమం, దత్త హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గుంతకల్లు పట్టణంలోని ఆలూరు రోడ్డులో గల షిరిడీ సాయిబాబా ఆలయంలో, అదేవిధంగా గుత్తి పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో, ఆర్ఎస్‌లోని గౌతమేశ్వర ఆలయంలో దత్త జయంతి వేడుకలను అశేష భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు.



తాడిపత్రిలో ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ఉరవకొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం సాయంత్రం అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు పూజలను చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ప్ర త్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉం చి పట్టణంలోని వీధుల గుండా ఊరేగించారు. అయ్యప్ప మాలధారు లు భజనలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామి ఆలయంలో పడిపూజను గోవర్ధన స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

నైతిక విలువల్ని పెంపొందించుకోవాలి

గుత్తి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైతికవిలువలును పెంపొందించుకోవాలని పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ సూచించారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో శనివారం 62వ కేంద్రీయ విద్యాలయ సంఘత్త స్థాపన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మల్కిసాబ్, వీకే పద్మాతమ్మ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పద్మావతమ్మ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలను 1963 డిసెంబరు 15న స్థాపించారన్నారు. ఈ పాఠశాలల్లో విద్యతో పాటు క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు. అలాగే నైతిక విలువలు పెంపునకు కృషి చేస్తారన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

బెళుగుప్ప, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరంలో శనివారం సీసీ రోడ్లు నిర్మాణ పనులను టీడీపీ ఉపాధ్యక్షుడు పెద్దతిప్పయ్య, జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడు రాము, స్థానిక టీడీపీ నాయకులు వీరాంజనేయులు భూమి పూజ చేసి ప్రారంభించారు. మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుల సహకారంతో గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో రోడ్లు వేస్తున్నామని నాయకుడు వీరాంజనేయులు తెలిపారు.

మోడల్ పేపర్లు ఆవిష్కరించిన మంత్రి కేశవ్

ఉరవకొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన పదో తరగతి పరీక్ష మోడల్ పేపర్లను ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ఆవిష్కరించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరైన మంత్రి వాటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూటీఎఫ్ విద్యారంగ, ఉపాధ్యాయసమస్యల పరిష్కారం కోసం పోరాటు చేయడమే కాకుండా మోడల్ టెస్ట్ పేపర్లు ప్రచురించడం హర్షణీయమన్నారు. ఈ మోడల్ పేపర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు రామప్పచౌదరి, శేఖర్, శ్రీనివాసులు, జయరాములు, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.



మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఉరవకొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం ప్యాపిలి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి(58) విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. మిద్దె పైనుంచి మెట్లు దిగుతున్న సమయంలో సర్వీస్ వైరు తగిలి షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి ఆయన చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారురూరు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: బీజేపీ

తాడిపత్రి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంకాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీని బూత్‌లెవల్‌స్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. కమిటీలుగా ఏర్పడి గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. పోలింగ్ బూత్‌ల నిర్మాణం గురించి వివరించారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు శింగరి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ చవ్వా రంగనాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామసమీపంలోని ఓ గ్రానైట్ పరిశ్రమలో నివాసం ఉంటున్న రంగనాయకులు (54) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలో ఉన్న ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో వాచ్‌మెన్‌గా రంగనాయకులు పనిచేస్తున్నాడు. నాలుగు రోజులక్రితం ఆయన చుక్కలూరు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడగా స్థానికులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య పుల్లమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రంగనాయకులు స్వగ్రామం గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామం కాగా ఉపాధి నిమిత్తం 13ఏళ్లక్రితం తాడిపత్రికి వలసవచ్చాడు.

విద్యార్థి మృతికి నివాళి

బొమ్మనహాళ్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన విద్యార్థి కురుబ శేఖర్(16) రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. శేఖర్ స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతుండేవాడు. దీంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్, టీడీపీ నాయకులు , కురుబ సంఘం నాయకులు శనివారం విద్యార్థి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం అతడి కుటుంబాన్ని ఓదార్చారు.

ఎస్ఐ మానవత్వం

పామిడి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీ కొట్టాల గ్రామానికి చెందిన యువరైతు సుదర్శన్‌కు చెందిన గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంలో అగ్నికి ఆహుతైన విష యం పాఠకులకు తెలిసిందే. మూగజీవాల కోసం ఉంచిన గ్రాసం కాలి బూడిదకావడంతో చలించిన ఎస్ఐ సుధాకర్ యాదవ్ ఆ రైతుకు ఐదు ట్రాక్టర్ల వరిగడ్డిని పంపించి మానవత్వం చాటుకున్నారు.

రాజీయే.. రాజ మార్గం

● లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోండి
● న్యాయాధికారుల సూచన

గుంతకల్లుటౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేసుల సమస్య పరిష్కార విషయంలో రాజీమార్గమే రాజ మార్గమని అడిషనల్ సివిల్ న్యాయాధికారి ప్రతిభ పేర్కొన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో న్యాయాధికారి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. అదే సరైన మార్గమని తెలిపారు. అనంతరం పలు సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగేషు, గోపాలకృష్ణ, ఈదుర్‌వలి, బడేసాహెబ్, చెన్నకేశవులు, సీ వెంకటేశులు, పీ వెంకటనాయుడు, ఎస్ శివరావ్, బాబాతాజుద్దీన్, నరసింహరావు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

530 కేసులు..

గుత్తి: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో మండల న్యాయసేవా సమితి చైర్మన్, అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీహరి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ జరిగింది. ఇందులో 530 కేసులను పరిష్కరించారు. ఎస్‌టీసీ, ఎంఓపీపీ, క్రిమినల్, సివిల్, ఓఎస్, ఈపీ, హెచ్‌ఎంఓపీలు, పీఎల్‌సీ తదితర కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ బూసాసుధీర్‌రెడ్డి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రామశర్మ, ఉపాధ్యక్షుడు పీడీ రత్నం, ఏజీపీ తిమ్మారెడ్డి, న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

212 కేసులు..

ఉరవకొండ: పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో 212 కేసులు పరిష్కరించినట్లు న్యాయాధికారి దుర్గా కల్యాణి పేర్కొన్నారు. వీటిలో సివిల్, ఎక్సైజ్, క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మీనారాయణరెడ్డి, తుకారం, జయరాజ్, రామ్మోహన్, జయరాజ్, శ్రీనివాస్, దామోదర్ నాయుడు పాల్గొన్నారు.



గుత్తిలో మెగాలోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న ఏడీజే శ్రీహరి

606 కేసులు..

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ జరిగింది. అనంతపురం మొబైల్ కోర్టు న్యాయాధికారి జే సుజిన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఇందులో ఐపీసీ కేసులు 90, భరణం కేసు ఒకటి, బ్యాంకు లోన్ కేసులు రెండు, పెట్టీ కేసులు 426 కేసులు మొత్తం 606 కేసులు పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు. పోలీసు అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

130 కేసులు..

తాడిపత్రి: పట్టణంలోని కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్ లో దాదాపు 130కేసులు పరిష్కరించినట్లు అనంతపురం అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మలాదేవి తెలిపారు. వీటిలో బ్యాంకులు, క్రిమినల్, సివిల్ తదితర కేసులు పరిష్కారమయ్యాయన్నారు. సబ్‌డివిజన్ పరిధిలోని తాడిపత్రి పట్టణంతోపాటు రూరల్, యల్లనూరు, పుట్లూరు, యాడికి, పెద్దపప్పూరు పరిధిలోని పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. పట్టణ, రూరల్ సీఐలు సాయిప్రసాద్, శివగంగాధర్‌రెడ్డి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజులరెడ్డి, న్యాయవాదులు హనీఫ్ బాషా, శివరామకృష్ణ, శ్రీనివాసులు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలకు

టీడీపీ మద్దతుదారుల ఏకగ్రీవం



కూడేరు మండలం అరవకూరులో ఎన్నికైన టీడీపీ మద్దతుదారులు

ఉరవకొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శనివారం సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉరవకొండ మండలంలోని బూదగవి చెరువు సాగునీటి సంఘానికి టీడీపీ మద్దతు దారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా తిమ్మప్ప, ఉపాధ్యక్షురాలిగా తిమ్మక్క, సభ్యులుగా రవి, శ్రీనివాసులు, రామాంజినేయులు, నాగరాజులు ఎన్నికయ్యారు. వారు ఎన్నికల అధికారి శుభకర్ నుంచి నియామక పత్రాలు అందుకున్నారు.

కూడేరు: మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికల్లో మూడు చోట్ల టీడీపీ కూటమి మద్దతు దారులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఒక చోట ఓటర్లు రాకపోవడంతో ఎన్నిక వాయిదా పడింది. అందులో అరవకూరు ఆయకట్టు అధ్యక్షుడిగా ఈశ్వరయ్య, ఉపాధ్యక్షుడిగా నరసింహులు, ఇప్పేరు ఆయకట్టు అధ్యక్షుడు పాండురంగా, ఉపాధ్యక్షుడిగా కుమ్మర శివన్న, మరుట్ల ఆయకట్టు అధ్యక్షురాలుగా శ్రీదేవి, ఉపాధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పొట్టిచెరువు ఆయకట్టు ఎన్నికలకు ఓటర్లు రాకపోవడంతో ఎన్నిక నిలబట్టినట్లు తహసీల్దారు మహబూబ్‌బాషా తెలిపారు.

బెళుగుప్ప: మండలంలోని శ్రీరంగాపురం, గంగవరం గ్రామాల్లో సాగునీటి ఎన్నికలు జరిగాయి. శ్రీరంగాపురం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా గంగప్ప, ఉపాధ్యక్షుడిగా డీ. వన్నూరు సాబ్, గంగవరం సంఘం అధ్యక్షురాలిగా ఎల్.రమాదేవి , ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శీర్పి సంఘానికి కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఏఈవో నాగేశ్వరశాస్త్రి తెలిపారు.

విడపనకల్లు: మండలంలో సాగు నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అందరూ టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు. జీబీసీ పరిధిలోని పాల్తూరు గ్రామంలో 1,2,3, వ కాలువలకు అధ్యక్షుడిగా కాలువ మారయ్య, హావళిగి గ్రామంలోని 4,5వ కాలువలకు అధ్యక్షుడిగా జింకలు రామన్న, డొనేకల్లు 6వ కాలువకు కారెన్న, పాలికి గ్రామంలోని 7 నుంచి 23వరకూ ఉన్న కాలువలకు అధ్యక్షుడిగా రాయల్ శ్రీనివాసులు, హెచ్ఎల్‌సీ పరిధిలోని 12వ కాలువకు అధ్యక్షురాలిగా పాల్తూరు గ్రామానికి చెందిన ఆర్ వేదావతి ఎన్నికయ్యారు. రెండు ఎంఐ ట్యాంక్‌లకు టీడీపీ మద్దతు దారులే ఎన్నికయ్యారు.



శెట్టూరు సాగునీటి సంఘం సభ్యులతో అధికారులు టీడీపీ నాయకులు

శెట్టూరు: మండలంలో ఐదు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగ్గా.. అందరూ టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ములకలేడు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా బీ. సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణప్ప, తిప్పనపల్లి అధ్యక్షుడిగా కే తిమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా చిన్న కరప్ప, శెట్టూరు అధ్యక్షుడిగా వన్నూరురెడ్డి, ఉపాధ్యక్షుడిగా లింగమయ్య, కనుకూరు అధ్యక్షుడిగా అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రామప్ప, యాటకల్లు అధ్యక్షుడిగా గొల్ల రాజన్న, ఉపాధ్యక్షుడిగా విరుపాక్షి ఎన్నిక అయినట్లు తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి తెలిపారు.

కుందుర్పి: మండలంలో మూడు సాగునీటి సంఘాలకు టీడీపీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కుందుర్పి అధ్యక్షుడిగా పి రామ్మూర్తి, ఉపాధ్యక్షుడిగా లోకేష్, మలయనూరు అధ్యక్షురాలిగా సమాధమ్మ, ఉపాధ్యక్షురాలిగా రంగమ్మ, నిజవల్లి అధ్యక్షుడిగా నాగరాజు ఉపాధ్యక్షుడిగా నన్నలింగప్ప ఎన్నికైనట్లు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మీ శంకర్ తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్: మండలంలో 4 సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు తహసీల్దారు భాస్కర్ తెలిపారు. నాలుగు సాగునీటి సంఘాల్లో టీడీపీ మద్ధతుదారులే గెలిచారు.

కంబదూరు : మండలంలోని ఆరు సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు తహసీల్దారు బాలకిషన్ తెలిపారు. అందరూ టీడీపీ మద్దతుదారులే గెలుపొందారు.



పామిడిలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

గుంతకల్లు టౌన్: మండలంలోని పాతకొత్తచెరువు, వైటీచెరువు, నాగసముద్రం సాగునీటి సంఘాలకు ఎన్నికలను అధికారులు నిర్వహించారు. పాతకొత్తచెరువు అధ్యక్షుడిగా ఎస్ రామచంద్ర, ఉపాధ్యక్షుడిగా బీ ఓబిరెడ్డి, వైటీచెరువు అధ్యక్షుడిగా ఇమ్మడి రామదాసు, ఉపాధ్యక్షురాలిగా నక్క అంజినమ్మ, నాగసముద్రం అధ్యక్షుడిగా సింగంశెట్టి మునిస్వామి, ఉపాధ్యక్షుడిగా ఎనుముల జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరూ టీడీపీ మద్దతుదారులు.

గుత్తి రూరల్: మండలంలో 10 సాగునీటి సంఘాలకు టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దొడ్డి-1 కాలవ సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ, పెద్దొడ్డి-2కి నాగరాజు, పెద్దొడ్డి-3కి కెపీ. నాగరాజు, మార్నేంపల్లికి అప్పా రామకృష్ణ, మాముడూరుకి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. గుత్తిచెరువుకి కేశవనాయుడు, కొత్తపేట చెరువుకి నాగభూషణం ఊబిచెర్ల చెరువుకి శ్రీనివాసులు, బాచుపల్లికి రంగస్వామి మాముడూరు చెరువుకి రఘునాథరెడ్డిగా ఎన్నికయ్యారు.

పామిడి: మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్ధతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పామిడి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా మీనుగ వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా కొవిలదిన్నె మారుతీ వరప్రసాద్‌రెడ్డి, ఎద్దులపల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా మజ్జిగ నరసింహులు, ఉపాధ్యక్షుడిగా కేఆర్ గోవిందరాజులు, అనుంపల్లి చెరువు అధ్యక్షుడిగా నీలప్పగారి లక్ష్మన్న, ఉపాధ్యక్షుడిగా కంచం సుంకయ్య, రామగిరి చెరువు అధ్యక్షుడిగా వడ్డే సుదర్శన్ బాబు,ఉపాధ్యక్షుడిగా రమావత్ కేశవనాయక్, పాళ్యం చెరువు అధ్యక్షుడిగా బాయినేని లక్ష్మన్న, ఉపాధ్యక్షుడిగా పూలవారి నారాయణస్వామి ఎన్నికైనట్లు తహసీల్దార్ శ్రీధరమూర్తి తెలిపారు. పార్టీ మద్దతుదారులు ఎన్నికవడంపై టీడీపీ నాయకులు పామిడి పట్టణంలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్-1 అనంతపురం వారు సాకే అనితకుమారి W/o ఓబుళపతి, C.ఓబుళపతి S/o C.ఓబలప్ప అను పేరునగల అస్తుల తాకట్టుపై C.ఓబుళపతి S/o C.ఓబలప్ప,8-61, జయంతి నగర్, బెస్తరపల్లి గ్రామం, కుందుర్పి మండలం, అనంతపురం జిల్లా వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు.దీనిపై ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజుల్లోపు నాకు గానీ నా క్లయింట్ కు కానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ అనంతపురంరూరల్ సబ్ రి॥డి॥కి చేరిన కూడేరు మండలం గొటుకూరు గ్రామ పంచాయితీ బ్రాహ్మణపల్లి గ్రామపొలంలోని సర్వేనెం.44లో ప్లాట్ నెంబరు 24&23 ప్లాటెనెం.24 చెక్కుబంది: తూర్పు: 33 అడుగులు వెడల్పు గల రోడ్డు, పడమర: ప్లాటెనెం:3, ఉత్తరం: ప్లాటెనెం.25, దక్షిణం : ప్లాటెనెం. 23 ప్లాట్ నెం.23 చెక్కు బంది: తూర్పు:33 అడుగులు వెడల్పు గలరోడ్డు, పడమర: ప్లాట్ నెం.4, ఉత్తరం:ప్లాట్ నెం. 24, దక్షిణం:ప్లాటెనెం.22

సురేశ్‌కుమార్, అడ్వకేట్,
ATP Cell:9440204098